పల్లకిలో పెళ్లికూతురు..!

పాత ఒక వింత.. కొత్త ఒక రోత ఈ నానుడి వినే ఉంటారు.. ప్రస్తుతం పరిస్థితి ఇలాగే ఉంది.. ఒక నాడు పెళ్లిళ్లలో పల్లకీలు.. గుర్రాలు ప్రధాన ఆకర్షణ.. రాను రాను అవి పోయి.. కొత్తగా కార్లు వచ్చాయి.. ప్రస్తుతం అవి పెళ్లి వేడుకల్లో ఉన్నా లేనట్టుగానే ఉంటున్నాయి.. ఎందుకంటే మళ్లీ ఆ పాత వింతగా మారింది.. ఈ చిత్రంలోనే చూస్తున్నారుగా.. బహూం..బహూం అటీ మోసుకొచ్చే పెళ్లి పల్లకీని దాదాపు అందరూ మర్చిపో యారు.. అయితే ఆదివారం దేవరపల్లిలో జరిగిన ఒక పెళ్లి వేడుకలో ఇలా మెరిసింది.. వల్లూరి రామబ్రహ్మం తన కుమారుడికి సంప్రదాయబద్ధంగా పెండ్లి తంతు జరిపించి నూతన వధూవరులను పల్లకీపై గ్రామంలో ఊరేగించారు. ఇదీ అందరినీ ఆకర్షించింది.. నాటి రోజులను గుర్తుచేసింది. - దేవరపల్లి



బెర్లిన్‌కు పయనమైన మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పర్యాటక, సాం స్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం సాయంత్రం బెర్లిన్ బయలుదేరి వెళ్లారు. జర్మనీలోని బెర్లిన్ ఎక్స్‌పో సెంటర్ సిటీలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకూ జరగనున్న అంతర్జాతీయ టూరిజంపై చర్చించనున్న 2025 సదస్సులో పాల్గొంటారు. ఈ మేరకు ఆయన మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాద్ చేరుకుని అక్కడ నుంచి నేరుగా బెర్లిన్ వెళతారు. పలువురు జనసేన నేతలు, కార్యకర్తలు అభిమానులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు .తిరిగి మంత్రి ఈ నెల 10వ తేదీన వస్తారు.

వెహికల్‌యార్డ్‌లో మాయాజాలం! 8
లారీ ఢీకొని రైతు దుర్మరణం



పట్టభద్రుడు.. ఎవరో!

ఏలూరు సీఆర్ఆర్‌లో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

మొత్తం ఓట్లు - 3,14,984
పోలైన ఓట్లు - 2,18,902
టేబుళ్లు - 28 - రౌండ్లు 17

నేడే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్

- ఏలూరు సీఆర్ఆర్‌లో ఏర్పాట్లు
- 36 గంటల పాటు లెక్కింపు
- అధికారుల అంచనా
- నిరవధికంగా సాగేలా చర్యలు
- షిఫ్టుల వారీగా సిబ్బంది
- బరిలో 35 మంది అభ్యర్థులు
- ఫలితం తేల్చేది ప్రాధాన్యత ఓట్లే

(ఏలూరు/రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఏలూరు సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫలితం వెలువడే వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఓట్ల లెక్కింపు సిబ్బందిని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ జరుగుతున్న తీరును రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పర్యవేక్షిస్తారు.అభ్యర్థుల పక్షాన ఏజెంట్లు సైతం కౌంటింగ్‌కు హాజరవుతారు. ఈ ఓట్ల లెక్కింపు కాస్త సుదీర్ఘంగానే కొనసాగబోతోంది. లెక్కింపు ఒక కొలిక్కి వచ్చేసరికి 36 గంటలు లేదా ఆపైబడి సమయం పడుతుందని భావిస్తున్నారు.

నేడు ఓట్ల లెక్కింపు..


పట్టభద్రుల నియోజకవర్గ ఓట్లను సోమవారం లెక్కించనున్నారు.గత నెల 27న పోలింగ్ జరగ్గా 2 లక్షల 18 వేల 902 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అధికార పక్షం భావిస్తోంది.పోలింగ్ సమయంలోనే నువ్వానేనా అనే ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో గత ఐదు రోజులుగా పోటీ చేసిన 35 మంది అభ్యర్థులతో పాటు, వారి అనుచరులు ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పట్టభద్రుల నియోజకవర్గంలో ప్రాధాన్యతా ఓటు ప్రకారం కొనసాగుతుంది.ఈ ప్రక్రియ అత్యంత సంక్లిష్టం కావడంతో కౌంటింగ్ సిబ్బందికి తగినంత శిక్షణ ఇచ్చారు. సోమవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉదయం 6.30 గంటల్లోపే నిర్దేశిత ప్రాంతాలకు చేరుకోవాల్సిందిగా సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది, టేబుల్స్ సూపర్‌వైజర్లు, రోల్ ఇన్‌చార్జులు, పర్యవేక్షణాధికారులు తమ పరిధిలో బాధ్యతలు నిర్వర్తించాల్సిందిగా ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు తెరిచే సమయంలో కట్టలు కట్టడం, ఆ తర్వాత లెక్కించే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ మేరకు జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి మార్గనిర్దేశం చేశారు.

లెక్కింపునకు 36 గంటలు

సాధారణ ఎన్నికల కంటే భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే దాదాపు 2 లక్షలకు పైగా బ్యాలెట్ పత్రాలను లెక్కించాల్సి ఉంది. అందుకే ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. తొలుత మొత్తం పోలైన ఓట్లలో చెల్లుబాటు కాని ఓట్లను గుర్తిస్తారు. ఇవి పోను, మిగిలిన ఓట్లను ప్రాధాన్యత క్రమంలో ఏ అభ్యర్థికి దక్కాయో వరుసగా లెక్కిస్తారు.ఈ ప్రక్రియ యావత్తు కొనసాగడానికి కాస్త సమయం పడుతుంది. ఓట్ల లెక్కింపు నిరవధికంగా కొనసాగడానికి వీలుగా లెక్కింపు సిబ్బంది,అధికారులను షిఫ్టుల వారీగా నియమించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పోలైన 2 లక్షల 18 వేల 902 ఓట్లను ఒక కొలిక్కి తేవాలంటే ఒక రోజంతా పడుతుందని భావిస్తున్నారు. ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు.. 17 రౌండ్లుగా ఉండేటట్లు నిర్దేశించారు. దీనికి అనుగుణంగా అన్నీ ఏర్పాట్లు చేశారు. ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీ చేసినందున ఆ మేరకు మరింత అప్రమత్తం అయ్యారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ముందుగా చెల్లని ఓట్లను తొలగించడం, మిగతా ఓట్లను కట్టలుగా కట్టి టేబుల్‌కు వెయ్యి చొప్పున మొత్తం 28 టేబుళ్లకు కలిపి 28 వేల వేల ఓట్లు లెక్కించడం ఆరంభిస్తారు. ఇలా 17 రౌండ్లు లెక్కింపు సాగుతుంది. రాత్రి పొద్దుపోయే సమయానికి ఈ ముందస్తు ప్రక్రియ ఒక్క కొలిక్కి రాగలదని,ఆ తర్వాతే అసలు సిసలైన ఓట్ల లెక్కింపు గాడినపడుతుందని అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆసాంతం పదేపదే సరి చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడున్న అధికారిక అంచనాల ప్రకారం లెక్కింపునకు 36 గంటలు దాటి సమయం పట్టే అవకాశం ఉంది.

కొన్ని గంటల్లో ఉత్కంఠకు తెర

రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ, మార్చి2(ఆంధ్రజ్యోతి) : మరికొన్ని గంటల్లో ఎమ్మెల్సీ ఉత్కంఠకు తెరపడనుంది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 35 మంది పోటీ పడగా గురువారం పోలింగ్ జరిగింది. ఈ మేరకు ఓట్లను సోమవారం ఏలూరులో లెక్కించనున్నారు. మొత్తం 3,14,984 ఓట్లు ఉండగా, 2,18,902 ఓట్లు పోలైన సంగతి తెలిసిందే. ఇది 69.50 శాతం.అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో మొత్తం 4669 ఓట్లు ఉండగా 3637 ఓట్లు పోలయ్యాయి. ఇది 77.9 శాతం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం 64,471 ఓట్లు ఉండగా 47,125 ఓట్లు పోలయ్యాయి.ఇది 73.09 శాతం. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 62,970 ఓట్లు ఉండగా 42,446 ఓట్లు పోలయ్యాయి. ఇది 67.41 శాతం. ఏలూరు జిల్లాలో 42,282 ఓట్లు ఉండగా 29,651 ఓట్లు పోలయ్యాయి. ఇది 70.13 శాతం. కాకినాడ జిల్లాలో మొత్తం 70,540 ఓట్లు ఉండగా, 47, 150 పోలయ్యాయి.ఇది 66.84 శాతం. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 70052 ఓట్లు ఉండగా, 48,893 ఓట్లు పోలయ్యాయి.ఇది 69.8 శాతం. ప్రధానంగా పోటీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం..పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవుల మధ్యన ఉన్నట్టు సమాచారం. పట్టభద్రులు ఎవరికి పట్టం కట్టారనేది మరి కొన్ని గంటల్లోనే తేలిపోనుంది.ఆరు జిల్లాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను ఏలూరులో భద్రపర్చారు.ఓటింగ్ సరళి ప్రకారం పరిశీలిస్తే.. ఫలితాలు రావడానికి 14 గంటలుగానీ,36 గంటల నుంచి 48 గంటలుగానీ సాగే అవకాశం ఉందంటున్నారు.



కాటన్ బ్యారేజీకి మంచిరోజులు

117 గేట్ల మార్పునకు నిధులు

- ఫలించిన ఎదురుచూపులు
- బ్యారేజీ మరమ్మతులకు నిధులు
- రూ.150 కోట్ల ప్రతిపాదనలు
- రూ.146 కోట్లు మంజూరు
- నేడో రేపో టెండర్లు పిలుపు
- గత ప్రభుత్వంలో చిన్నచూపు
- ఐదేళ్లు కనీస మరమ్మతుల్లేవ్
- కూటమి రాకతో బ్యారేజీపై దృష్టి
- నిధుల విడుదలకు ప్రయత్నాలు
- డ్రిప్ పథకం కింద మంజూరు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి పూర్వవైభవం రానుంది.కూటమి ప్రభుత్వం చొరవ కారణంగా ఈ వారంలో డ్రిప్ పథకం కింద రూ.146 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ వేసవిలోనే టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టనున్నారు. దీంతో బ్యారేజీ మనుగడకు ముప్పు తప్పినట్టయింది. గత ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరైన నిర్వహణ లేక కాటన్ బ్యారేజీ మరమ్మతులకు గురైంది. ఈ మేరకు ఢిల్లీలోని సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యుసీ) 2022లో స్వయంగా పరిశీ లించి తక్షణం మరమ్మతులు చేయకపోతే సమస్య ఉత్పన్నమవుతుందని అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అయినా పట్టించుకోలేదు. గతేడాది జనవరి 11,12 తేదీల్లో ప్రపంచ బ్యాంక్ నిపుణుల బృందం బ్యారేజీని పరిశీలించి మొత్తం 117 గేట్లను మార్చి కొత్తవి అమర్చాలని సూచించింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కదలికలేదు. ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకూ 7 కిలోమీటర్ల పొడవున బ్యారేజీకి 175 ఫ్లడ్ గేట్లు, 22 స్లూయిజ్‌లు కలిసి మొత్తం 197 ఉన్నాయి. గత ప్రభుత్వం అసలు బ్యారేజి నిర్వహణ పట్టించుకోకపోవడంతో చాలా గేట్లు నిర్వహణ కష్టమవుతోంది.ఆపరేట్ చేసే సమయంలో అవి మొరాయిస్తున్న సంగతి కూడా తెలిసింది.

10.5 లక్షల ఎకరాల ఆయకట్టు

వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరంతా లక్షలాది టీఎంసీలు ధవళేశ్వరం కాటన్ బ్యారేజి గుండా దిగువకు వెళ్లాల్సిందే. ఎంత నీరు వచ్చినా 175 గేట్లు దాటి అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుండా సముద్రంలోకి పోతుంది. అంతే కాకుండా ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో తూర్పుగోదావరి, కాకినాడ,అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 10.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు బ్యారేజీ కారణంగానే నీరందుతుంది. 2 కోట్ల మంది ప్రజలకు మంచినీరు, పలు పరిశ్రమలకు నీరు లభిస్తోంది.బ్యారేజి ఏ మాత్రం దెబ్బతిన్నా ఏటిగట్టూ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.ఇంతటి ప్రాధాన్యత ఉన్న బ్యారేజీ కాపాడడానికి వైసీపీ ప్రభుత్వం కనీస ఆలోచన చేయలేదు.సీడబ్ల్యుసీ నిపుణులు 117 గేట్లు మొత్తం మార్చేయాలని చెప్పినా పట్టించు కోలేదు.ఇరిగేషన్ అధికారులు కొన్ని ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు.

నిధులు మంజూరు ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ బ్యారేజీని డ్యామ్ రిహేబిలిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రామం (డ్రిప్)లో పెట్టారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ నుంచి గత జూన్‌లో అప్పటి డీఈ రమేష్ ఢిల్లీ వెళ్లి రూ. 150కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చి వచ్చారు. ఇందులో గేట్లు రీప్లేస్‌మెంట్, మరమ్మతులకు రూ.110 కోట్లు అంచనా వేశారు. ఎలక్ట్రికల్ , కేబుల్, కంట్రోలు ప్యానల్‌కు సుమారు రూ. 9.5కోట్లు అంచనా వేశారు. రోడ్ల నిర్మాణానికి రరూ.4 కోట్లు,సివిల్ వర్కుకు రూ.18 కోట్లు, భవన నిర్మాణానికి రూ.3 కోట్లు అంచనా వేశా రు. రూ. 150 కోట్లు ప్రతిపాదించగా రోడ్ల నిర్మాణం పూర్తికావడంతో రూ.146 కోట్లకు అనుమతిచ్చి శాంక్షన్ చేశారు.దీంతో బ్యారేజీకి మంచిరోజులొచ్చినట్టు అయింది.

9 నుంచి కోరుకొండ నరసన్న కల్యాణోత్సవాలు

- ఐదు రోజుల పాటు ఉత్సవాలు
- ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- 10న రథోత్సవం..కల్యాణం
- ఉత్సవాల్లో ఉచిత అన్నదానం
- ముస్తాబు చేస్తున్న నిర్వాహకులు

కోరుకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 9న అంకురార్పణతో ప్రారంభమై 15వ తేదీ చక్రతీర్థంతో ఉత్సవాలు ముగియనున్నాయి. అన్నవరం దత్తత దేవాలయంగా ఉండడంతో ఆ దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.సుబ్బారావు పర్యవేక్షణలో అనువంశక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్‌ల పర్యవేక్షణలో కల్యాణోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతు న్నాయి.స్వామి వారి దిగువ ఆల యం, కొండపైన ఆలయాలకు, ఉప ఆలయాలకు,ముఖ ద్వారాలకు మెట్ల మార్గానికి, ఆలయ శిఖరాలకు రంగులు వేస్తున్నారు. అర్చకస్వాములు ఉత్సవ మూర్తులను సిద్ధం చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, టెంట్లు వేస్తున్నారు. ఉత్సవాలకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు.అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. పాల్గుణ శుద్ధ ఏకాదశి రోజు ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజున పెద్ద ఎత్తున భక్తులు దేవుడి కోనేరులో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకోవడం ఇక్కడ సాంప్రదాయం.ఈ మేరకు కోనేరు వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు, బట్టలు మార్చుకునే షెడ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానం సిబ్బంది భక్తులకు స్వామి ప్రసాదంగా లడ్లు తయారుచేస్తున్నారు.ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి.సుమారు 16 వరకు హుండీలు ఏర్పాటు చేస్తున్నారు. అంతే కాకుండా మిరియాల వెంట రెడ్డి పంతులు ధర్మసత్రంలో ఐదు రోజుల పాటు ఉదయం, సాయంత్రం భక్తులకు ఉచిత అన్నప్రసాదం అందించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో ఐదు రోజులు పాటు పండితసభలు ఏర్పాటు చేయ నున్నారు.





9న ఉత్సవాలకు అంకురార్పణ

9వ తేదీన ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 10వ తేదీన మొదటి రోజు రథంపై స్వామి గ్రామోత్సవం చేస్తారు.అనంతరం నాలుగు రోజులు ఆంజనేయ,గరుడ, చిన్నశేషవాహనం, పెద్ద శేషవాహనం,గజవాహనాలపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆయా వాహనాలు సిద్ధం చేస్తున్నారు.ప్రతిరోజు రాత్రి జరిగే గ్రామోత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కల్యాణవేదికపై మొదటి రోజు స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి రోజు రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. హరికథలు, బుర్రకథలు, కోలాటం, భరతనాట్యం వంటివి నిర్వహించనున్నారు.

పల్లెకు.. పండగేదీ!



అసంపూర్తిగా గోకులం షెడ్

బిల్లులు రాక.. నిలిచిన పనులు

- ఇప్పటికే నీరసించిన పనులు
- ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి
- రూ.147 కోట్లు పెండింగ్
- సీసీ రోడ్లవే రూ.110 కోట్లు
- అసంపూర్తిగా గోకులాలు
- పూర్తికాని డ్రెయినేజీల నిర్మాణం
- ఎక్కడి పనులు అక్కడే
- నిధులు రాక కాంట్రాక్టర్ల లబోదిబో

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)
పల్లె పండగ పేరుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అనేక పనులు అప్పుడే నీరసించాయి. బిల్లులు రాకపోవడంతో రెండు నెలలుగా ఎక్కడివి అక్కడే అన్నట్టు ఈసురోమంటున్నాయి. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి సంబంధించి బిల్లులు ఆలస్యం అవడంతో పలు చోట్ల వీటిని కాంట్రాక్టర్లు నిలిపివేశారు. బిల్లులు వచ్చాక తిరిగి చేద్దామనే ధోరణితో మధ్యలోనే వదిలేశారు. అటు గోకులాల షెడ్లను తొలుత సొంత నిధులతో ప్రారంభించిన రైతులు సైతం బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.4 కోట్ల వరకూ బిల్లులు విడుదల కావాల్సి ఉంది. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లా వ్యాప్తంగా రూ.147 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రూ.110 కోట్లకుపైగా బకాయిలు సీసీ రోడ్లవే కాగా మిగిలినవి గోకులాల షెడ్ల బాకీలున్నాయి. అయితే బకాయిల్లో కేంద్రం నుంచి సగానికిపైగా, మిగిలినవి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ నుంచి విడుదల కావాల్సి ఉన్నాయి. మరో పక్క రైతులు ముందుకురాని చోట్ల కాంట్రాక్టర్లు నిర్మించిన గోకులాల షెడ్లలో అప్పుడే నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి.

వచ్చాక చూద్దాం..

వాస్తవానికి రెండునెలలుగా అధికారులు అదిగోఇదిగో అంటున్నా బిల్లులు రాకపోవడంతో అటు కాంట్రాక్టర్లు, ఇటు రైతులు పనులను మధ్యలో ఆపేశారు. సీసీ రహదారులకు సంబంధించి ఒక్కో పనిని రూ.3 లక్షల వరకు విభజించి నామినేషన్ ప్రాతిపదికపై కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీరంతా చిన్నాచితకా కాంట్రాక్టర్లు కావడంతో బిల్లులు రాక పనులు చేయలేమని తెగేసి చెప్పేస్తున్నారు. కొందరైతే ప్రారంభించినవి మధ్యలో ఆపేయగా, మరికొందరు బిల్లులు వస్తేనే పని మొదలుపెడతామని తెగేసి చెబుతున్నారు. వాస్తవానికి పల్లె పండగకు పనులకు సంబంధించి ఉపాధి హామీ పనుల ద్వారా సమకూరే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వెచ్చిస్తున్నారు. ఈ నిధులు 75 శాతం కేంద్రం, మిగిలిన 25 శాతం రాష్ట్రప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆర్థికంగా అనేక ఇబ్బందులున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి కొంత జాప్యమవుతోంది. కాగా ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల గోకులాల షెడ్లను ముందుగా తమ సొంత నిధులతో నిర్మించుకోలేని రైతుల కోసం అధికారులే కొందరు కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పనులు చేయి ంచారు. వీటిలో చాలా వరకు నాణ్యతా లోపాలు బయటపడుతుండడం విశేషం.

రూ.147 కోట్లు బకాయి

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల పరిధిలో కొత్తగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం గతేడాది అక్టోబరు 14 నుంచి పల్లె పండగ పేరుతో అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఉపాధి హామీ పథకానికి సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్, ఆర్థిక సంఘం నిధుల ద్వారా బిల్లులు చెల్లించే విధంగా పనులకు జిల్లాల వారీగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామాల్లో ఎక్క డెక్కడ సీసీ రోడ్లు, డ్రెయినేజీలు అవసరమో గుర్తించి వాటిని నిర్మించడానికి వీలుగా అంచ నాలు సిద్ధం చేశారు. రైతుల కోసం గోకులాల షెడ్లను ఈ పథకంలో చేర్చారు. సీసీ రహదారులు, డ్రెయిన్లు, గోకులాల షెడ్లకు సంబంధించి కాకినాడ జిల్లాలో మొత్తం రూ.180 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. ఇందులో ఇప్పటి వరకు రూ.38 కోట్ల బిల్లులు చెల్లించారు. కానీ పూర్తయిన, మధ్యలో కొనసాగుతున్న పనులకు సంబంధించి ఇంకా రూ.42 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. డిసెంబరు నెలాఖరు వరకు ఠంఛనుగా వచ్చిన బిల్లులు ఆ తర్వాత నుంచీ పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా అనేక పనులను అటు కాంట్రాక్టర్లు, ఇటు రైతులు నిలిపివేశారు. బిల్లులు వస్తేనే తిరిగి చేయగలమంటూ అధికా రులకు తెగేసి చెప్పేశారు. మరో పక్క బిల్లులు రాకపోవడంతో రూ.102 కోట్లకు సంబంధించి వివిధ దశల్లో ఉన్న పలు పనులపైనా ప్రభావం పడింది. అనేక చోట్ల కాంట్రాక్టర్లు వీటిని మధ్యలో నిలిపివేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 650 సీసీ రహ దారులు, 675 గోకులాల షెడ్లను ఈ పథకం కింద ప్రారంభించారు.ఇప్పటి వరకు కొన్ని బిల్లులు చెల్లింపులు జరగ్గా, ఇంకా రూ.65 కోట్ల వరకు బాకీలు పేరుకుపోయాయి.ఇందులో రూ.4 కోట్ల వరకు గోకులాల షెడ్లకు సంబం ధించిన బిల్లులుండగా,మిగిలిన రూ.61 కోట్లు సీసీ రహదారులవే ఉన్నాయి.అటు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోను రూ.40 కోట్ల వరకు బిల్లులు పేరుకుపోయాయి. సింహభాగం సీసీ రహదారులవే. మొత్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.147 కోట్లు బకాయిలుగా తేలాయి.ఇవి రాక అనేక పనులపై ప్రభావం పడింది.



అసంపూర్తిగా ఉన్న సీసీ రహదారి

మిర్చి పంటను పీల్చేస్తున్న తామర పురుగు



తామరపురుగు సోకి దిగుబడిన లేని మిర్చి తోట

» వెలవెలబోతున్న మిర్చి తోటలు » దెబ్బతిని నల్లగా మారిపోతున్న వైనం
» పంట దిగుబడిపై తీవ్రప్రభావం » నష్టాల్లో మిర్చి రైతులు

ఎటపాక, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఎర్ర బంగారంగా పిలిచే మిర్చిపంటకు గత నాలుగేళ్లగా ప్రతికూల పరిస్థితులు ఎదుర వుతున్నాయి. వాణిజ్య పంట అయిన మిర్చికి తామరపురుగు పట్టి పీడిస్తూ ఉండడంతో పాటు వరుస నష్టాలతో రైతులు ఇక ము న్ముందు పంటకు విరామం ప్రకటించే పరిస్థి తులు ఏర్పడుతున్నాయి. అసలే మిర్చి పంట కు సరైన ధరలేక రైతు సతమతమవుతున్న తరుణంలో పంటకు తామర పురుగు సోకి, దిగుబ డిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీం తో రైతుకు కోలుకోలేని విధంగా దెబ్బమీద దెబ్బ తగులుతోంది. దాంతో మిర్చి సాగుని నమ్ముకున్న రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక సాగు చేయడం తమవల్ల కాద ంటూ తేల్చి చెబుతున్నారు. అల్లూరి జిల్లాలోని విలీన మండలాల్లో ఈ ఏడాది సుమారు 4 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. గతనెల జనవరి వరకు పంటకు తామర పురుగు వ్యాపించకుండా బాగున్నప్పటికీ ఫిబ్రవరి ప్రారంభంలో మిర్చి పంటకు తామర పురుగు ఆశించింది. అయితే ఈ పురుగు పంటకు పూత దశలో వ్యాపించడంతో పంట ఆకు రసం పీల్చి, పంట స్వరూపాన్ని మార్చేస్తోంది. ఆ తర్వాత పంట ముడతబారి, నల్లగా మారిపోయి దిగు బడిపై తీవ్ర ప్రభావంను చూపుతోంది. ఎన్ని రకాల పురుగు మందులు పిచికారీ చేసినా ఎటువం టి ప్రయోజనం ఉండడంలేదని రైతులు పేర్కొంటున్నారు.

కళా విహీనంగా మిర్చి తోటలు

ఈ ఏడాది జనవరి నెల వరకు బాగానే ఉన్నా మిర్చి తోటలు ఫిబ్రవరిలో సోకిన తా మరపురుగుతో తోటలన్నీ కళాహీనంగా మారి వెలవెలబోతున్నాయి. సాధారణ సమయంలో ఎకరాకు 20 నుంచి 25 క్వింటాల వరకు పంట దిగుబడి వచ్చేదని తామరపురుగు ప్రభావంతో ఎకరాకు ఆరేడు క్వింటాల మించి దిగుబడిరాని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఎట పాక మండలంలో ప్రధానంగా గన్నవరం, తోటపల్లి, నందిగామ, మురుమూరు, కృష్ణవరం నల్లకుంట, విస్సాపురం, నెల్లిపాక తదితర గ్రామాల్లో మిర్చి తోటలకు తామరపురుగు ఆశించింది. గత నెలలో మొదటి దశ మిర్చి కోతలు నిర్వహించారు. ఆ తర్వాత తామర పురుగు వ్యాపించడంతో దిగుబడి రాక తోటల న్నీ పంటకాలం ముగిసినట్టుగా మారి పోయా యి. దాంతో రైతులు కొందరు పశువులను ఆ తోటల్లో మేపుతున్నారు.



గన్నవరంలో తామరపురుగురు సోకిన తోటలో పశువులను మేపుతున్నరైతు

తగ్గిన పంట దిగుబడి

తామరపురుగు, వైరస్‌ల ప్రభావంతో గత నాలుగేళ్లగా మిర్చి రైతులు నష్టాలను మూట గట్టుకున్నారు. రెండేళ్ల నుంచి మిర్చి రైతులది గడ్డు పరిస్థితి. ఈఏడాది సాగుకు సాహసించని పరిస్థితి. అయినా ఈసారైనా పంట కలిసోస్తుం దని కొండంత ఆశతో సాగుకు శ్రీకారం చుట్టా రు. ఈ ఏడాది పెరిగిన ఖర్చులతో ఎకరాకు రూ 1.50లక్షల పెట్టుబడులు అయినట్లు రైతు లు చెబుతున్నారు. తామరపురుగు దెబ్బకు ఎకరాకు ఆరేడు క్వింటాలు మాత్రమే పంట దిగుబడి వచ్చిందని, మరోసారి పంట కోతలు చేపట్టే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడ్నాలుగుసార్లు కోతలు చేపట్టే మిర్చికి ఒక్కసారి కోతలతో ముగించేసే పరిస్థితి రావడంతో రైతులు నష్టపోవాల్సిన దుస్థితి నెల కొంది. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి దిగుబడి ఆ స్థాయిలో లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే తోటలన్నీ కళతప్పి ఉన్నాయి. మరోవైపు ప్రస్తుత మిర్చి క్వింటా ధర రూ.11వేల నుంచి 12వేల మధ్య పలు కుతోందని, ఇంతలా ధర ఎప్పుడూ పతనమవ లేదని రైతులు పేర్కొంటున్నారు.

రూ.15 లక్షలు నష్టపోయాను

● పూజారి వెంకన్న, రైతు, గన్నవరం



ఈఏడాది 9ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. జనవరి నెల వరకు పంట బాగానే ఉ న్నా, గత ఇరవై రోజుల నుంచి మిర్చికి తామరపురుగు ఆశిం చింది. 9 ఎకరాల పంట మొత్తం నల్లగా మారి దెబ్బతింది. ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పంటకు రూ15 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. రూ 14 లక్షల నష్టం వచ్చింది.

తామరపురుగు వదలడంలేదు

● మల్లాడి దావీద్, రైతు, గొల్లగూడెం



గత మూడేళ్ల నుంచి మిర్చి కి తామరపురుగు వ్యాపించే పీ డ పోవడంలేదు. ఎన్ని మందు లు పిచికారీ చేసినా పూర్తి స్థాయిలో పురుగు నశించడంలేదు. వ్యవ సాయశాఖ అధికారులు తామర పురుగు శాశ్వత నివారణకు చర్యలు అన్వేషించ డంలేదు. వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు పంటపై పరిశోధనలు చేసి తామర పురుగును అరికట్టాలి.



రాయవరం: వెదురుపాక మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

● ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

రాయవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దైవ గ్రంథం ఖురాన్ అవతరించిన నెలకు ఇస్లాం మతంలో ప్రత్యేకస్థానం ఉంది. ముస్లింలకు అ త్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభమైంది. శనివారం రాత్రి నెలవంక కనిపించడంతో ముస్లిం పెద్దల ఆదేశాలకు అనుగుణంగా 2వ తేదీ నుంచి నెలరోజుల పాటు ముస్లింలు నెలరోజు లపాటు పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు చేప ట్టారు. ఈనెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు, ప్రత్యేక నమాజ్‌లను భక్తిశ్రద్ధలతో ఆచ రిస్తారు. ఇందులోభాగంగా తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్షలు చేపట్టి ముస్లింలు రాత్రి వరకు దైవారాధనలో గడుపుతారు. ఖురాన్ సూచించిన విధంగా నెలరోజులపాటు ఉపవాస ం సమయంలో మంచినీరు తీసుకోకుండా రాత్రి వరకు దీక్ష కొనసాగిస్తారు. వెదురుపాక, రా యవరం, లొల్ల, చెల్లూరు, పసలపూడి గ్రామా ల్లో ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టారు. వెదురుపాకలో మతపెద్ద షేక్ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో మసీదును విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



కాకినాడలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 2(ఆంధ్రజ్యో తి): కాకినాడ నగర పరిధిలోని ఉన్న అన్ని మసీదులు ముస్లిం భక్తులతో నిండి కిటకిటలా డాయి. నెలరోజులపాటు జరిగే ఉపవాస దీక్షల్లో ముస్లిం ప్రజలు పాల్గొని ఈ ఉపవాస దీక్షలను అవలంభిస్తారు. మసీదుల్లో ప్రార్థనలు ప్రారం భమవగా ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు. రంజాన్ విశిష్టతను జాబియా మసీదు అధ్యక్షుడు ఏజాజుద్దీన్ మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ముస్లిం లు కఠోర ఉపవాస దీక్ష ఉండి సాయంత్రం మసీదులో దీక్షను విరమిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా గంజిని అన్ని మసీదుల్లో తయారుచేస్తామ న్నారు. దీన్ని సేవించడంవల్ల శరీరంలో ఉన్న నీరసంపోయి శక్తి వస్తుందన్నారు. అలాగే రాత్రి 8.30కు జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో ఖురాన్ ప టిస్తామని తెలిపారు.

కవి సంధ్య కవితల పోటీ విజేతలు

యానాం,మార్చి2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా యానాం కవిసంధ్య, చిన్ని నారాయణరావు ఫౌండే షన్ నెల్లూరు సంయుక్తంగా నిర్వహించిన వచన కవితల పోటీ విజేతలను కవి సంధ్య అధ్యక్షుడు శిఖామణి ప్రకటించారు. వీరిలో ప్రథమ బహుమతి నూజివీడుకు చెందిన డాక్టర్ జడా సుబ్బారావు (ఒంటరై ఉమ్మడి తనం), ద్వితీయ బహుమతి తెలం గాణ రాష్ట్రం సిద్ధిపేటకు చెందిన పర్కపల్లి యాదగిరి (తర్పణం), తృతీయ బహుమతి దుబ్బాకకు చెందిన ఐలేని గిరి (నడిచిన పాదాలు) నిలిచారు. అదేవిధంగా పది కవి తలకు ప్రోత్సాహక బహుమతులు ప్రకటిం చారు. వీరిలో శ్రీకాకుళంనకు చెందిన వినో ద్ గుత్తం (పాపం నాజేబు), తూర్పుగోదా వరిజిల్లాకు చెందిన మోకా రత్నరాజు (సృష్టికర్తలం), గోకవరంనకు చెందిన జేడీ వరలక్ష్మీ (శ్రమదేహాలు), తెలంగాణా రాష్ట్రం ఆదిలాబాద్‌కు చెందిన బి.వేణుగోపాలరెడ్డి (సాగుదూరం), యానాంకు చెందిన పోను గుమట్ల అశోక్‌కుమార్ (పచ్చని చెట్టులా), విజయవాడకు చెందిన బి.వి.శివప్రసాద్ (యుద్ధము-శాంతి), తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన పిన్నంశెట్టి కిషన్ (ఇల్యూషన్), నిర్మల్‌కు చెందిన తమ్మల దేవ్‌రావ్(వరి గొలకులు), తెలంగాణా రాష్ట్రం ఆదిలాబాద్‌కు చెందిన ఉదారి నారా యణ (గాజుల పండుగ)లు ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారు. ఈపోటీ లకు ప్రముఖ కవి కోడూరి విజయ్‌కుమార్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈనెల 23న ఆదివారం సాయంత్రం హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం లో జరిగే ప్రపంచ కవితా దినోత్సవంలో బహుమతులను ప్రదానం చేయనున్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కాకినాడ క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాకినా డ జగన్నాథపురం స్వప్న థియేటర్ సమీపంలో పేకాడుతున్నారన్న పక్కా సమా చారంతో సీఐ ఎం.నాగదుర్గారావు తన బృందంతో కలిసి శిబిరంపై ఆదివారం దాడి చేశారు. 12 మందిని కాకినాడ వన్ టౌన్ పోలీసులు అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.22,620 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కొత్తపల్లిలో ఘరానా మోసం

● రుణాలు ఇప్పిస్తానంటూ లక్షలాది రూపాయలు వసూలు

కొత్తపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అమా యకులైన వ్యక్తుల బలహీనతలను ఆసరాగా తీసుకుని వారి అవసరాలకు రోజువారీ అప్పు లు, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తాన ంటూ వేలకు వేలు దోచుకున్న ఘరానా మోస గాడి విషయం ఆలస్యంగా వెలుగులోకి వ చ్చింది. కాకినాడకు చెందిన వి.ప్రసాద్ సెక్యూ రిటీ సర్వీస్‌లో పనిచేసేవాడు. కాకినాడజిల్లా కొత్తపల్లికి చెందిన యువతిని వివాహం చేసు కున్నాడు. పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తు లతో పరిచయాలు పెంచుకున్నారు. తక్కువ వడ్డీకి అప్పులు, ప్రైవేటు బ్యాంకులో రుణాలు ఇప్పిస్తానంటూ కొత్తపల్లికి చెందిన పలువు రు చేతి పనులు, కూలీనాళీ చేసుకునే వారి దగ్గర నుంచి రూ.3వేలు నుంచి రూ.5వేలు వరకు నగదుతో పాటు ఆధార్‌కార్డులు తీసుకు న్నాడు. తాను కూడా ఈ విధంగా మోసపో యానని బాధితుడు ఉడతా వెం కన్న వాపో యాడు. మోసం చేశాడని గ్రహించిన వారు ప్రసాద్‌ను సొమ్ము మొత్తాన్ని ఇవ్వమని ప్రా ధేయపడగా తమపై కేసులు పెడతానని బెది రిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగి న అన్యాయంపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వెంకన్న చెప్పాడు.

కాకినాడ ఆర్‌ఎంసీలో..

వైభవంగా స్నాతకోత్సవ సంబరం

248మంది వైద్యవిద్యార్థులకు పట్టాల ప్రదానం

ముఖ్యఅతిథిగా డీఎంఈ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ నరసింహం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహం

జీజీహెచ్(కాకినాడ), మార్చి 2(ఆంధ్ర జ్యోతి): కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో 62వ స్నాతకోత్సవ సంబరం అంబరాన్నంటిం ది. 2019-2025 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన సుప్రీం స్టాల్ వార్ట్స్ బ్యాచ్ అన్నీ తామై స్నాత కోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించింది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 248మంది వైద్యవిద్యార్థులు పట్టాలు పొందా రు. కార్యక్రమానికి 5వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంఈ, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఆర్‌ఎంసీ ప్రిన్సి పాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజర య్యారు. గౌరవ అతిథిగా జీజీహెచ్ సూప రింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి హాజ రయ్యారు. కార్యక్రమంలో విజయనగరం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి, జీజీ హెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, హెచ్‌వోడీలు డాక్ట ర్ డి.మాణిక్యాంబ, డాక్టర్ ఉమామహేశ్వర రావు, ఐఎంఏ నాయకులు డాక్టర్ చిట్ల కిరణ్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఆదిత్య సత్యప్రసన్న, ఆర్‌ఎంసీ బోధకులు డాక్టర్ ఎన్‌శైలజ హాజర య్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైద్య రంగంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వైద్యు డికి ప్రత్యామ్నాయం ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ కాదని పేర్కొన్నారు. భావోద్వేగాలను గుర్తించే గుణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు లేదన్నారు. తాను ఆర్‌ఎంసీనుంచి వెళ్లి రాష్ట్రం లో అత్యున్నత స్థానంలో కీలక విధులు నిర్వ ర్తించడానికి తనకు ప్రత్యామ్నాయంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ప్రిన్సిపాల్ బాధ్య తలు సమర్థవంతంగా నిర్వర్తించడమే కార ణమన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు చేసిన త్యాగాలను ఎన్నటికీ మరువరాదన్నారు. డాక్టర్ దేవీమాధవి, డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు ఇది ఒక కొత్త అధ్యాయమన్నారు. విద్యార్థులు వైద్యు లుగా మాత్రమే కాకుండా రోల్ మోడ ళ్లుగా తీర్చిదిద్దాలన్నారు. రోగులు, సమాజం పట్ల కృతజ్ఞతతో మెలగాలన్నారు. పేరు ముందు డాక్టర్ అని రావడం గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థులతో వైద్య ప్రమా ణం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసిం హాన్ని సత్కరించారు. 2019-2025 బ్యాచ్‌లో అత్యంత ప్రతిభావంతుడుగా గుర్తించిన డాక్టర్ సాయి అనిరుధ్ ఉపన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 9 అవార్డులు, 5 బంగారు పతకాలు సాధించిన ఆయన అందరి దృష్టిని ఆకర్షిం చారు. ఐదున్నరేళ్ల విద్యలోని పాఠ్యాంశాలు ఎంతో విలువైనవన్నారు. కార్యక్రమంలో విద్యా ర్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ రంగరాయ వైద్య కళాశాలలో అత్యంత క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన పిల్లలకు అందిందని హర్షం వ్యక్తం చేశారు. రంగరాయలో తమ పిల్లలు చదువుతున్నందుకు గర్వపడుతు న్నామంటూ ఎవరికైనా చెప్పడంలో ఎంతో సంతృప్తి ఉంటుందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

'జయలక్ష్మి సొసైటీ పాలకవర్గం పనితీరుపై అసంతృప్తి'

సర్పవరంజంక్షన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరానికి పాల్పడినవారు బెయిల్‌పై బ యట తిరగడం, సిట్ నివేదిక ప్రకారం బోర్డు బకాయిల వసూళ్లు, నిందితులపై సివిల్, క్రిమి నల్ చర్యలు తీసుకోవడంలో ఉదాసీన వైఖరి, సిట్ నిందితుడిగా పేర్కొన్న వ్యక్తిని డైరెక్టర్‌గా కొనసాగించడం, జవాబుదారీతనం లోపించ డంవంటి కారణాలతో జయలక్ష్మి సొసైటీ పాల కవర్గంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు ది జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ లిమిటెడ్ డిపాజి టర్స్ బాధితుల సంఘం సభ్యులు తెలిపారు. బోర్డు సభ్యులను రీకాల్ చేసేందుకు తక్షణం మహాజన సభ నిర్వహించి సీక్రెట్ ఓటింగ్ తో పాలకవర్గాన్ని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కాకినాడ విద్యుత్నగర్‌లో ని చల్లా కల్యాణ మండపంలో జయలక్ష్మి సొసై టీ డిపాజిటర్ల బాధితుల సంఘం సభ్యు ల



సమావేశంలో మాట్లాడుతున్న బదరీనాథ్

సమావేశాన్ని అధ్యక్షుడు జి.బదరీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయనతోపాటు సెక్రటరీ పిల్లి గణేష్, జాయిం ట్ సెక్రటరీ ఎస్.రామారావు, ట్రెజరర్ వీఎస్ సుబ్బారావు, కొంతమంది సభ్యులు మాట్లాడా రు. 2022 ఏప్రిల్‌లో రూ.560 కోట్లతో బోర్డు తిప్పేసిన అప్పటి ఛైర్మన్ ఆంజనేయులు, వైస్ ఛైర్‌పర్సన్ విశాలాక్ష్మిలతోపాటు డైరెక్టర్లు పరారయ్యారన్నా రు. బాధితులంతా కలిసి అడ్‌హక్ కమిటీ, తర్వాత పర్మినెంట్ బోర్డు ఏర్పాటు చేసుకున్నా రు. నూతన కమిటీ పగ్గాలు చేపట్టి రెండున్నర ఏళ్లు కావస్తున్నా బాధిత డిపాజిటర్లు ఆశించిన మేర పనిచేయలేదన్నారు. అర వై మంది బాధి తులు మృతి చెందారన్నారు. కేసుల వివరాలు, నిందితుల ఆస్తులజప్తు వివరాలు, సివిల్, క్రిమి నల్ కేసులపై సభ్యులకు ఎటువంటి సమాచా రం ఇవ్వట్లేదని విమర్శించారు. బోర్డులో ఉన్న ఇద్దరు సభ్యులు ఉద్యోగరీత్యా వేరేచోట ఉంటు న్నారన్నారు. డైరెక్టర్ల స్టాగర్డ్ టర్మ్ పూర్తవ్వడం, డైరెక్టర్లు రాజీనామా చేసిన వాటి వివరాలను ఛైర్మన్ ఎవరికీ చెప్పట్లేదని ఆరోపించారు. బ్యాంకింగ్, కో-ఆపరేటివ్ సెక్టార్లలో అనుభవ మున్న సభ్యులతో డైరెక్టర్లను భర్తీచేయాలని కోరినా పట్టించు కోవట్లేదన్నారు. ప్రభుత్వ అధి కారులను డైరెక్టర్లుగా నియమించాలని డిమాం డ్ చేశారు.100మంది బాధితులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో పిచ్చికుక్క స్వైరవిహారం

● 15మందికి గాయాలు

ఏలేశ్వరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):నగర పంచాయతీ పరిధిలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి 15మందిని గాయపరిచింది. ఆదివారం స్థానిక నెయిల్‌పేట, మందుల కాలనీ, పెద్దవీధి, నందివీధులలో పిచ్చికుక్క కరవడంతో వీరంతా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. వీరిలో కార్తికే య, జాన్ అనే చిన్నారులను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నట్టు వైద్యురాలు శైలజ తెలిపారు.

రావులపాలెంలో బ్యాటరీ బైక్ దగ్ధం



దగ్ధమైన బ్యాటరీ బైక్

రావులపాలెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో పార్కింగ్ చేసిన బ్యాటరీ బైక్ నుంచి మంటలు వ్యాపించి దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పశ్చిమగోదా వరిజిల్లా మార్టేరు సమీపంలోని నిక్కపూ డికి చెందిన సత్తి పెద్దిరెడ్డి స్థానికంగా ఉన్న బంధువుల ఇంటికి బ్యాటరీ బైక్‌పై వచ్చా రు. అక్కడ పార్కింగ్ చేసి లోపలి వెళ్లారు. కొంతసేపటికి బైక్‌లోంచి మంటలు చేలరేగి పెద్దఎత్తున వ్యాపించడంతో బైక్‌లోని బ్యాట రీలు పెలుతాయనే భయంతో సమీపంలోని ప్రజలు పరుగులు తీశారు. పార్కింగ్ చేసి న బ్యాటరీ బైక్ కళ్లేదుటే కాలిపోవడంతో బైక్ యజమాని షాక్‌కు గురయ్యాడు. దీంతో పెద్దిరెడ్డికి స్థానికులు సపర్యలు చేసి ధైర్యాన్ని అందించారు.

సిద్ధివినాయక ఆలయంలో అక్షరాభ్యాసాలు



అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

అయినవిల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అయి నవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కి క్కిరిసింది. ఆదివారం ఫాల్గుణమాసం సంద ర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. చిన్నారులకు అ క్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేశారు. అయిన విల్లి క్షేత్రంలో భక్తులు ఈతి బాధల నివారార్థం నిత్యం జరిగే శ్రీలక్ష్మీగణపతి హోమంలో పాల్గొ న్నారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు చే శారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు.

అర్తమూరు ముద్దు బిడ్డగా గర్విస్తున్నా

● గ్రామంలో ఆధ్యాత్మిక పరిమళాలు భేష్

● గ్రామాభివృద్ధికి సహకరిస్తా : యూపీ డీజీపీ రామశాస్త్రి



యూపీ డీజీపీ వెంకట రామశాస్త్రి దంపతులను సత్కరిస్తున్న స్థానికులు, మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

మండపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి) ఆగస్త మహాముని, పెద్ద జీయర్, చిన్నజీయర్‌లు జన్మించిన పుణ్యభూమి అర్తమూరులో జన్మించి నందుకు తనకెంతో గర్వంగా ఉందని యూపీ డీజీపీ పిడపర్తి వెంకట రామశాస్త్రి అన్నారు. మండపేట మండలం అర్తమూరు గ్రామంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారి 17వ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమానికి డీజీపీ వెంకటరామ రామశాస్త్రి, నీరజ దంపతులు ఆదివారం రాత్రి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన ప్రముఖులు, ఆలయ నిర్వాహకులు రామశాస్త్రి, నిరజ దంపతులకు ఆలయ మర్యా దలతో ఆదివారంరాత్రి ఘనస్వాగతం పలికా రు. శాస్త్రి తాను పుట్టిపెరిగిన అర్తమూరులో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసు కున్నారు. ముందుగా శాస్త్రి దంపతులు వేంకటేశ్వరస్వా మిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఆలయ నిర్వాహకులు శేషవస్త్రా లు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ట్రస్టీ ఎస్.బీఎస్.ఆర్ ట్రస్టీ సత్తి బుల్లి స్వామిరెడ్డి అధ్యక్షతన శాస్త్రి దంపతులను ఘనంగా సత్కరించారు. అర్తమూరుకు చెందిన శాస్త్రి ఇక్కడ ప్రజలకు చేసిన సేవలను వారు కొనియాడారు. శాస్త్రి తండ్రి రామం గ్రామంలో ఎంతోమందికి విద్యాభ్యాసం చేయించారని ఆయనవద్ద నేర్చుకున్న వారేందరో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. తాను ఏ స్థాయిలో ఉన్నా ఇక్కడ మూలాలు మరిచిపోనని అర్త మూరు వాసులకు ఏ సాయం కావాలన్నా తన వంతు అందిస్తానని ఆయన చెప్పారు. ఇక్కడ వాతావరణం ఆధ్యాత్మిక చింతన ఎంతో బాగుందన్నారు. శాస్త్రి దంపతులను అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తిసూర్యానారాయణరెడ్డి, ఆలయట్రస్టీ సత్తి బుల్లిస్వామిరెడ్డి, కర్రి బాపి రెడ్డి, పడాల సుబ్బారెడ్డి తదితరులు ఘనం గా సత్కరించారు. రాజమహేంద్రవరంనకు చెందిన స్వామీ న్యూరాలజీ ఆసుపత్రి వైద్యులు పరిమి నాగసత్య ప్రసాద్, డాక్టర్ సత్తి బుల్లి స్వామిరెడ్డి దంపతులను ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

రాజ్యాంగ హక్కులపై ప్రజలకు అవగాహన అవసరం

● ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల

యానాం,మార్చి2(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యం గంలో దేశ ప్రజలకు అంబేడ్కర్ కల్పించిన హక్కు లపై ప్రజలకు పూర్తి అవగాహనతోపాటు హక్కుల పరిరక్షణకు ఉద్యమించాల్సిన పరిస్థితులు నెలకొ న్నాయని ఏపీ పౌరహక్కుల సంఘ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది ముప్పాల సుబ్బారావు అన్నా రు. యానాం సర్వశిక్ష అభియాన్ సమావేశపు హా లులో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75ఏళ్లు అయిన సందర్భంగా ఏపీ హేతువాద స ంఘం, యానాం సివిల్‌రైట్స్ సొసైటీ, యానాం డా క్టర్ అంబేడ్కర్ సంక్షేమసంఘ సంయుక్త నిర్వహ ణలో జనజాగృతి సభ ఆదివారం నిర్వహించారు ఈ సభలో ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ రా జ్యాంగంలో అంబేడ్కర్ ఎంతో దూరదృష్టితో ప్రజ లకు మత స్వేచ్ఛతోపాటు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ కల్పించారన్నారు. కానీ, అవి హరించ బడుతున్నా యన్నారు. రాజ్యాంగ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. సభలో అఖిల భారత హేతువాద సంఘం ప్రతినిధి నార్నె వెంకటసుబ్బయ్య శాస్త్రీయ, మా నవతా దృక్పథంపై ప్రారంభోపన్యాసం చేశా రు. సభకు యానాం సివిల్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణు మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం ప్రముఖకవి దాట్ల దేవదానంరా జు మాట్లాడుతూ దేశానికి పటిష్టమైన రా జ్యాంగం ఉండడంవల్ల ఎన్నో తట్టుకుని దేశం నిలబడుతుందన్నారు. సమావేశంలో మాజీ పరిపాలనాధికారి గిడ్డి బలరాం, నామడి అప్పారావు, పండు సిద్ధార్థ కుమార్, దవులూరి పతి పాల్గొన్నారు.



ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావుకు అమరజ్యోతి అంబేద్కర్ పుస్తకాన్ని అందజేస్తున్న రచయిత పొనుగుమట్ల విష్ణుమూర్తి

నెలాఖరులోపు పన్నులు చెల్లించండి



మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర పరిధిలోని ఆస్తిపన్నులు, ఖాళీ స్థలాల, నీటి చార్జీలు చెల్లించాల్సిన ప్రజలు ఈనెల 31వ తేదిలోపు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నుల బకాయిలు చెల్లించవలసిన వారు వెంటనే చెల్లించడం ద్వారా నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధికి తోడ్పాటునిచ్చిన వారవుతారని అన్నారు. చెల్లించకపోతే కార్పొరేషన్ చట్టంలో నిర్దేశించిన ప్రకారం అత్యవసర సర్వీసులైన కుళాయి, విద్యుత్ కనెక్షన్లు నిలుపుదల చేయడమే కాకుండా ఆస్తి జప్తుకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్నులు చెల్లింపుదారుల సౌకర్యార్థం నగరంలోని ఏడు ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీఎల్ పురంలో సచివాలయం-23లోను, ప్రకాష్‌నగర్ మీసేవ కేంద్రలోని సచివాలయం-14, సీతంపేట మీసేవ కేంద్రలోని సచివాలయం-81, కోటిపల్లి బస్టాండ్ మీసేవా కేంద్రంలోని సచివాలయం-36, నారాయణ పురం సచివాలయం-3, బొగ్గులదిబ్బ సచివాలయం-42, బర్మాకాలనీ సచివాలయం-89లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటిపన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించవచ్చని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

చైతన్యరాజుకు పలువురు పరామర్శ



లక్ష్మీకాంతం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ ఛైర్మన్ వేణు

రాజానగరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న చైతన్య సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) కులపతి కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు)ను పలువురు ప్రముఖులు ఆదివారం జీజీయూ ప్రాంగణంలోని వారి నివాసంలో పరామర్శించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, పర్వత పూర్ణచంద్రప్రసాద్, జ్యోతుల చంటిబాబు, కొండేటి చిట్టిబాబు, చిల్లా జగదీశ్వరి, జేఎన్‌టీయూకే మాజీ వీసీ ఆచార్య ప్రసాదరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన సత్యనారాయణరాజు, టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ, రాజానగరం జడ్పీటీసీ వాసంశెట్టి పెదవెంకన్న , విశ్రాంత డీఎస్పీ నామగిరి బాబ్జీ తదితరులు చైతన్యరాజును కలసి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. లక్ష్మీకాంతమ్మ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు రమణమ్మ జయంతి



రమణమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో రాజమహేంద్రవరం నుంచి కీలక పాత్ర వహించిన మహనీయ దంపతులు మద్దూరు వెంకట రమణమ్మ, అన్నపూర్ణయ్యలని చాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా డైరెక్టర్ కొయ్యను కుమారి అన్నారు. రమణమ్మ 119వ జయంతి సందర్భంగా ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో కోటిపల్లి బస్టాండ్ వద్ద స్వాతంత్ర సమర యోధుల పార్కులో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భర్త జైలు శిక్ష అనుభవిస్తుండగా రమణమ్మ స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొందని, ఎన్నో కష్టాలకోర్చి పిల్లల్ని పోషించి చదివించిందన్నారు. కార్యక్రమంలో మంచిరాజు హేమలత, మాదిరాజు శ్రీనివాస్, బలరామ నాయుడు పాల్గొన్నారు.

'అమ్మకు వందనం' ప్రభుత్వ పాఠశాలలకే

పరిమితం చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్

దివాన్‌చెరువు, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వపాఠశాలలకే పరిమితం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు ప్రభుత్వానికి సూచించారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ఈ పథకం వర్తింపజేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగడంతో బాటు ప్రభుత్వ పాఠశాలలు కూడా బలోపేతం అవుతాయన్నారు. ఆర్థిక స్థోమత కలిగిన వారే కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తారని, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీనిని వర్తింపచేసినప్పటికీ వారికి పెద్దగా ఉపయోగం ఉండదన్నారు.సమావేశంలో ఎస్టీయూ నాయకులు భీమేశ్వరరావు, ధర్మరాజు, వీరబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లి ఆలయానికి

ఎమ్మెల్యే గోరంట్ల విరాళం

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): హుకుంపేట పంచాయతీ డి బ్లాక్‌లో ఉన్న సత్తెమ్మతల్లి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సూచించారు. ఆదివారం రాజమహేంద్రవరంలో తన నివాసంలో సత్తెమ్మతల్లి ఆలయ కమిటీ పెద్దలకు ఆలయ అభివృద్ధి నిమిత్తం ఆయన రూ.లక్ష విరాళం అందించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో భాగంగా డి-బ్లాక్‌లో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, కురుకూరి కిషోర్, గారపాటి నాగేశ్వరరావు, కొల్లి దుర్గాప్రసాద్, టి.రాము పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్

అడిషనల్ పీఎస్‌గా శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్,మార్చి 2(ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ అడిషనల్ పీఎస్‌గా శ్రీనివాసరావు నియామకం కానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసినట్టు తెలిసింది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఈయన విధుల్లోకి చేరనున్నట్టు తెలిసింది. ప్రస్తుతం శ్రీనివాసరావు రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవో విధులు నిర్వర్తిస్తున్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన

హైకోర్టు జడ్జి మల్లికార్జునరావు

కడియం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అమరావతి హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు ఆదివారం కడియపులంక పుల్లా అబ్బులు - సత్యదేవా నర్సరీని, పుల్లా చంటియ్య-సత్యదేవా నర్సరీని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సందర్శించారు. నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను వారు తిలకించారు. ఈ సందర్భంగా జడ్జి కొన్ని రకాల మొక్కలను కొనుగోలు చేశారు. కార్యక్రమాల్లో పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్, డీఎస్పీ భవ్యకిషోర్, మెర్ల కృష్ణ, చెక్కపల్లి పుల్లారావు పాల్గొన్నారు.

'విద్యారంగానికి బడ్జెట్‌లో

కేటాయింపులు తగ్గించారు'

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపు తగ్గడడం విచారకరమని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. విద్యారంగానికి తూట్లు పొడుస్తూ కేవలం ప్రాథమిక విద్యకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు కేటాయించారని, ఇది చాలా అన్యాయమని పేర్కొన్నారు. ఈ కేటాయింపులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు.

కూటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అనపర్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుతుకులూరులో పార్వతీ సమేత కూటేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో స్వామి వారి విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దపంతులు విచ్చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత

అనపర్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం పేదలు అప్పులపాలు కాకూడదనే ధ్యేయంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రామవరంలో జరిగిన కార్యక్రమంలో మహేంద్రవాడకు చెందిన మేడపాటి సత్యవతి వైద్యం నిమిత్తం మంజూరైన రూ.1.62 లక్షల మంజూరు పత్రాలను ఆమె బంధువులకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాటవరంలో

పాశాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

సీతానగరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటవరంలో గ్రామ దేవత శ్రీ పాశాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం జరగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు, దాతల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విచ్చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టూరి రంగారావు, పోలిన కృష్ణ, బీజేపీ మండలాధ్యక్షురాలు రాపాక వెంకట లక్ష్మితోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దెందులూరులో వాహనాన్ని

ఢీకొని ఐదుగురికి గాయాలు

దెందులూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దెందులూరు హైవే వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి.రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నివాసం ఉంటున్న ఊట్ల రామకృష్ణ కుటుంబీకులు ఐదుగురు శనివారం పిడుగురాళ్లకు వివాహానికి వెళ్లి ఆదివారం తెల్లవారుజామున తిరిగి కారులో వస్తుండగా దెందులూరు పెట్రోల్ బంకు దాటి గుండేరు వాగు సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న రామకృష్ణకు అతని అమ్మమ్మ అనంతలక్ష్మికి తీవ్రంగాను, ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి.

మంత్రి నాదెండ్లను కలిసిన యర్రా



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు మర్యాదపూర్వకంగా కలిసారు. ఆదివారం మోరంపూడిలో మంత్రి దుర్గేష్ కార్యాలయానికి నాదెండ్ల వచ్చారు. ఈ సందర్భంగా వేణు కలిశారు.

వెహికల్ యార్డ్.. మాయాజాలం

మరమ్మతుల పేరుతో భారీ దోపిడీ

- రిపేరు వాహనాలను ఆన్‌లైన్ టెండర్‌కు వెళ్లనివ్వని వైనం
- రూ.90 వేల లోపు ఎస్టిమేట్లు చూపించి పైపై మెరుగులు
- మెకానికర్లతో కుమ్మక్కు
- కొద్ది రోజులకే రిపేరుకు వస్తున్న ఆర్‌ఎంసీ వాహనాలు
- చెత్త తరలింపునకు ఇబ్బందులు



మరమ్మతులతో పక్కన పెట్టేసిన చెత్తసేకరణ వాహనాలు



మరమ్మతుకు గురైన చిన్న కాంపేక్టర్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వెహికల్ యార్డ్ ఒక మాయాజాలంగా మారింది. దీనితీరు మార్చడం ఎవ్వరి తరం కావడం లేదు. అవినీతి అక్రమాలకు అడ్డాగా వెహికల్ యార్డ్ మారిపోయింది. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ వాహనాల నిర్వహణ నిమిత్తం క్వారీ సెంటర్‌కు సమీపంలో వెహికల్ యార్డ్‌ను ఏర్పాటు చేశారు. ఏడాది క్రితం కార్పొరేషన్‌కు 118 వాహనాలు వచ్చాయి. వాటిలో 30 ట్రాక్టర్లు, 40 సీఎన్‌జీ ఆటోలు, 10 చిన్న కాంపేక్టర్లు, 6 బిగ్ కాంపేక్టర్లు, 6 టిప్పర్లు, 4 జేసీబీలు, 6 వాటర్ ట్యాంకర్లు, 6 వాటర్ ట్రాక్టర్లు, ఉన్నాయి. ఆయా వాహనాల నిర్వహణ, మరమ్మతులు, కండిషన్‌లో పెట్టడం, వాహనాలను రాత్రికి అక్కడే నిలుపుదల చేయడం వంటి వాటికి కేంద్రంగా వెహికల్ యార్డు ఉంది. కాని ఈ యార్డును పట్టుకొని కొందరు తమకు అనుకూలంగా మలుచుకుని చక్రం తిప్పుతున్నారు.

రిపేర్ల పేరుతో దోపిడీ

యార్డులో వాహనాల మరమ్మతుల స్కాం జరుగుతున్నట్టు విమర్శలు వ్యక్తమౌతున్నాయి. రిపేర్లకు వచ్చిన వాహనాలను తొలుత పక్కన పెట్టి ఉంచాలి. రూ.లక్ష దాటితే ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ నిర్వహించాల్సి వుంటుంది కాబట్టి రూ.90 వేల లోపు మరమ్మతుల ఎస్టీమేట్లు చూపించి రిపేర్ల పేరుతో పైపై మెరుగులు దిద్ది కొన్నింటిని తెరపైకి తెచ్చి బిల్లులు చేసుకుంటున్నారు. దీంతో ఆ వాహనాలు కొద్దిరోజులకే తిరిగి మళ్లీ రిపేర్లకు గురై షెడ్డుకుపోతున్నాయి. సుమారు 10 ఆటోలు షెడ్డులో పెట్టారు. చిన్న కాంపేక్టర్ ఆరునెలలుగా మూలన పడింది. దానికి రూ.లక్ష లోపు ఖర్చు అవుతుంది. నామినేషన్ నిమిత్తం వదిలేసారు. ఇందులో వెహికల్ యార్డు ఇన్‌చార్జి.. వారికి తెలిసిన మెకానికర్లతో కుమ్మక్కైనట్టు తెలిసింది. వాహనాలను కూడా ఒకరికి మాత్రమే రిపేర్లకు ఇవ్వడం, సదరు మెకానికర్ నెమ్మదిగా ఒక్కో వాహనం రిపేరు చేయడంతో మిగిలిన వాహనాలు అలానే నిలిచిపోతున్నాయి. దీంతో చెత్త తరలింపులో వాహనాల కొరత ఏర్పడి ఇబ్బందులు ఎదురౌతున్నాయి. అలా కాకుండా మరమ్మతుకు గురైన వాహనాలను నలుగురు మెకానికర్లకు అప్పగిస్తే అన్ని వాహనాలు ఒక్కసారే మరమ్మతులు పూర్తిచేసుకుని బయటకు వస్తే చెత్తసేకరణ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించండి

ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్



సభలో మాట్లాడుతున్న శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్న ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా సమరశఖం పూరించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక చందా సత్రంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, ఎం.ఏసు అధ్యక్షతన జరిగిన రెండు ఐఎఫ్‌టీయూ విలీన సభకు ఆయన ముఖ్యవక్తగా విచ్చేసి మాట్లాడారు. కార్మికవర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని ధ్వజమెత్తారు. ఏప్రిల్ నుంచి లేబర్ కోడ్‌లు అమలు చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటిస్తోందని, అదే జరిగితే కార్మికులు సమస్యల విషవలయంలో చిక్కుకుంటారని, ఉపాధికి రక్షణ కరువవుతుందన్నారు. దేశాభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధిగా ఉండాలని, కాని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని ఆరోపించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, కార్యదర్శి ఆర్.మోహన్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రజా పోరాటాలతో దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిగా పి.ప్రసాద్‌ను, ప్రధాన కార్యదర్శిగా కె.పోలారి, ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు కార్యదర్శులు, ఒక కోశాధికారి, 28 మంది కమిటీ సభ్యులుగా కార్యవర్గాన్ని ఎంపిక చేసి ఏకగ్రీవం చేశారు. తొలుత నగరంలో సుబ్రహ్మణ్యం మైదానం నుంచి భారీ ర్యాలీగా చందా సత్రానికి చేరుకున్నారు. సభలో అరుణోదయ కళాకారుల విప్లవ గేయాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో పలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి

నిత్యాన్నదానానికి విరాళం

బిక్కవోలు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంకు చెందిన వర్రే రామాంజనేయులు ప్రశాంత లక్ష్మి దంపతులు ఆదివారం రూ.51,116 విరాళం అందించారు. వీరికి ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్‌స్వామి దర్శనం చేయించి స్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

ఆరికరేవులలో యాగశాలకు

రాట ముహూర్తం

బిక్కవోలు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆరికరేవుల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించే యాగశాలకు ఆదివారం గ్రామానికి చెందిన తొండాపు సూర్యనారాయణరెడ్డి లత దంపతులు రాట ముహూర్తం చేశారు. ఆలయంలోని పాత విగ్రహలను తీసి నూతనంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, విఘ్నేశ్వరుడు, శ్రీలలితా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించే కార్యక్రమాలను ఈనెల 12నుంచి 15వరకూ నిర్వహించనున్నట్టు వారు పేర్కొన్నారు.

8న వెల్‌బేబీ పోటీలు

దివాన్‌చెరువు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఈ నెల 8న స్థానిక వినయ్ విద్యా విహార్‌లో వెల్‌బేబీ పోటీలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల ఛైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆరేళ్లలోపు బాలబాలికలకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను 8వ తేదీ ఉదయం 9 గంటల్లోపు 99663 77767, 91336 26188 నెంబర్లుకు తెలియజేయాలని వెంకటేశ్వరరావు కోరారు.

చికెన్ వైపు.. జనం చూపు

కొద్దిగా పెరిగిన చికెన్ విక్రయాలు

తగ్గని మటన్, చేప, రొయ్య ధరలు



అనపర్తిలో చికెన్ షాపు వద్ద కొనుగోలుదారులు

అనపర్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో నెల రోజుల పైబడి నిలిచిపోయిన చికెన్ అమ్మకాలు ఆదివారం కొద్ది మేర ప్రారంభం కావడంతో చికెన్ వ్యాపారుల్లో ఆశలు చిగురించాయి. ఆదివారం అనపర్తి చికెన్ మార్కెట్‌కు వినియోగదారులు రావడంతో 20శాతం మేర అమ్మకాలు జరిగినట్టు తెలుస్తోంది. ఇటీవల కోళ్ల రైతులు ఏర్పాటు చేస్తున్న ఉచిత చికెన్ మేళాలకు స్పందన కనిపించినట్టవుతోంది. అయితే నేటికీ మటన్, చేప, రొయ్యల ధరలు మాత్రం తగ్గకపోవడంతో నాన్‌వెజ్ ప్రియులు ఇబ్బంది పడుతున్నారు. మటన్ ధర కిలోకు రూ.200 పైబడి పెరగడంతో కొందరు వ్యాపారులు ఆదివారం అనపర్తి మార్కెట్‌లో సీమపంది మాంసం దుకాణాలు నెలకొల్పారు. కిలో రూ.500కు సీమ పంది మాంసం అంటూ మైక్‌లో ప్రచారం హోరెత్తించి అమ్మకాలు సాగించారు. ఇప్పుడిప్పుడే చికెన్ ప్రియుల్లో అనుమానాలు తొలగుతున్నాయని ఒకటి రెండు వారాల్లో వినియోగం యథాస్థితికి చేరుతుందని వ్యాపారులు ఆశిస్తున్నారు.

చికెన్ మేళా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆజాద్ చౌక్‌లో ఆదివారం సాయంత్రం రాజమండ్రి సిటీ చికెన్ హోల్‌సేల్ అండ్ రిటైల్ వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా చికెన్ మేళాకు విశేషస్పందన లభించింది. చికెన్ తినండి ఆరోగ్యంగా ఉండండి అనే నినాదనంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని చికెన్ పదార్థాలు, కోడిగుడ్లను భుజించారు. ప్రజల్లో అనుమానాలను నివృత్తి చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించనట్టు వర్తక సంఘం తెలిపింది.



రాజమహేంద్రవరంలో జరిగిన చికెన్ మేళాలో మాంసప్రియులు

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే వాసు ఆర్థిక సాయం



విద్యార్థి తల్లికి సాయం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన వి.లక్ష్మీగాయిత్రి పేద విద్యార్థి. నీట్ పరీక్షకు సిద్ధమౌతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.50 వేలు టీడీపీ నాయకులతో కలిసి సమకూర్చారు. ఆదివారం రాజమహేంద్రవరం ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్నాయుడు చేతుల మీదుగా విద్యార్థిని తల్లికి నగదును అందించారు. చదువుకు పేదరికం అడ్డం కాకుడదనే భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక మంది విద్యార్థులకు సహకారం అందిస్తున్నామని ఆదిరెడ్డి వాసు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, చాపల చిన్నరాజు, బంగారు నాగేశ్వరరావు, బత్తుల కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి కాపాడండి

పీరా రామచంద్రపురంలో శ్రీచక్ర ఆయిల్ మిల్ ఎదుట గ్రామస్థుల ధర్నా

అనపర్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ మిల్ నుంచి వచ్చే దుమ్ము, ధూళితో తమ ఆరోగ్యాలు పాడవుతున్నాయని, ఫ్యాక్టరీ కలుషిత నీటితో పంట పొలాలు నాశనమవుతున్నాయంటూ ఆదివారం పీరా రామచంద్రపురంలోని శ్రీచక్ర ఆయిల్ మిల్ ఎదుట గ్రామస్థులు, రైతులు ధర్నా నిర్వహించారు. కాలుష్యం నుంచి తమను కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు కర్రి బులిరెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎన్ని సార్లు యాజమాన్యానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు.

సత్‌ప్రవర్తనతో మెలగండి

రౌడీషీటర్లు, పాత నేరస్తులకు సీఐ గణేష్ కౌన్సెలింగ్

ధవళేశ్వరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, పాత నేరస్తులు, సస్పెక్ట్ షీట్ కలిగిన వారిని ఆదివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సత్‌ప్రవర్తన కలిగి ఉండాలని సీఐ టి.గణేష్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, గొడవలకు దిగినా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగించే స్టాపర్ బోర్డులను స్థానిక టీడీపీ నాయకుడు సావాడ శ్రీనివాసరెడ్డి స్టేషన్ వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను సీఐ అభినందించారు.

పెళ్లిలో నగదు, బంగారం చోరీ

పోలీసులకు హైదరాబాద్ వాసి ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కల్యాణ మండపంలో జరిగిన వివాహవేడుకలో దుండగులు రూలక్ష నగదు, 70గ్రాముల బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. ప్రకాష్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి కామినేని శ్రీధర్ తన కుటుంబంతో ఆదివారం ఉదయం రాజమహేంద్రవరం చేరుకుని చెరుకూరి కల్యాణ మండపంలో బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యారు. రెస్ట్‌రూమ్‌లో బ్యాగులు పెట్టుకున్నారు. మధ్యాహ్న సమయంలో రెస్ట్‌రూమ్‌కి వెళ్లి చూస్తే బ్యాగ్‌లో పెట్టిన రూ.లక్ష నగదు, 70 గ్రాములు బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సరీ రైతులకు మంచి రోజులు

కడియం నర్సరీ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో మంత్రి నాదెండ్ల



ప్రమాణ స్వీకారం చేస్తున్న నర్సరీ సంఘం పాలక వర్గం

కడియం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన కడియం నర్సరీలకు మంచి రోజులు రానున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక జీఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం కడియం నర్సరీ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా విచ్చేసారు. ముందుగా సర్‌ఆర్థర్ కాటన్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నూతన పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. నర్సరీ సంఘ అధ్యక్షుడిగా రత్నం అయ్యప్ప, ఉపాధ్యక్షుడిగా బోడపాటి గోపి, డైరెక్టర్లుగా గాద నాగేశ్వరరావు, అడ్డగర్ల రమేష్, మల్లు శివన్నారాయణ, కోఆప్షన్ మెంబర్‌గా కొవ్విడి వాసు, మరో ఏడుగురు కార్యవర్గసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సోము వీర్రాజు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, రౌతు సూర్యప్రకాశరావు, ఆకుల వీర్రాజు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మల్లు పోలరాజు, పుల్లా ఆంజనేయులు, వేగుళ్ల లీలాకృష్ణ, గంటా స్వరూపాదేవి, అత్తి సత్యనారాయణ, బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని రైతు దుర్మరణం

లారీని మరో లారీ ఓవర్‌టేక్ చేస్తుండగా బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం

రాజానగరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరు సమీపంలో ఆదివారం లారీ ఢీకొని ఓ రైతు అక్కడిక్కడే మృతిచెందాడు. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన గారపాటి నరేంద్ర(45)కు కొంతమూరులో కొంత భూమి ఉంది. ఆ పొలంలోని వరి పండించి మాసూలు చేశాడు. ఆదివారం ధాన్యం తూకం వేయించి మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా కొంతమూరు సమీపంలోని నయారా పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న లారీని, అధిగమించబోతున్న మరో లారీ మోటార్ సైకిల్‌పై వెళ్తున్న నరేంద్రను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడిక్కడే మృతిచెందాడు. ప్రమాదం ధాటికి శరీరం నుజ్జునుజ్జుగా మారింది. కాగా నరేంద్రకు ఇద్దరి కుమారులు ఉన్నారు. పంచానామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాజానగరం ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేశారు.



పల్లకిలో పెళ్లికూతురు..!

పాత ఒక వింత.. కొత్త ఒక రోత ఈ నానుడి వినే ఉంటారు.. ప్రస్తుతం పరిస్థితి ఇలాగే ఉంది.. ఒక నాడు పెళ్లిళ్లలో పల్లకీలు.. గుర్రాలు ప్రధాన ఆకర్షణ.. రాను రాను అవి పోయి.. కొత్తగా కార్లు వచ్చాయి.. ప్రస్తుతం అవి పెళ్లి వేడుకల్లో ఉన్నా లేనట్టుగానే ఉంటున్నాయి.. ఎందుకంటే మళ్లీ ఆ పాత వింతగా మారింది.. ఈ చిత్రంలోనే చూస్తున్నారుగా.. బహుం..బహుం అటే మోసుకొచ్చే పెళ్లి పల్లకీని దాదాపు అందరూ మర్చిపో యారు.. అయితే ఆదివారం దేవరపల్లిలో జరిగిన ఒక పెళ్లి వేడుకలో ఇలా మెరిసింది.. వల్లూరి రామబ్రహ్మం తన కుమారుడికి సంప్రదాయబద్ధంగా పెండ్లి తంతు జరిపించి నూతన వధూవరులను పల్లకీపై గ్రామంలో ఊరేగించారు. ఇదీ అందరినీ ఆకర్షించింది.. నాటి రోజులను గుర్తుచేసింది. - దేవరపల్లి



బెర్లిన్‌కు పయనమైన మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పర్యాటక, సాం స్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం సాయంత్రం బెర్లిన్ బయలుదేరి వెళ్లారు. జర్మనీలోని బెర్లిన్ ఎక్స్‌పో సెంటర్ సిటీలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకూ జరగనున్న అంతర్జాతీయ టూరిజంపై చర్చించనున్న 2025 సదస్సులో పాల్గొంటారు. ఈ మేరకు ఆయన మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాద్ చేరుకుని అక్కడ నుంచి నేరుగా బెర్లిన్ వెళతారు. పలువురు జనసేన నేతలు, కార్యకర్తలు అభిమానులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు .తిరిగి మంత్రి ఈ నెల 10వ తేదీన వస్తారు.

ఆటో ఎక్కితే.. పయనమెటో! లారీ ఢీకొని రైతు దుర్మరణం 8



ఓటేస్తున్న పేరాబత్తుల (ఫైల్)

ఓటేస్తున్న రాఘవులు (ఫైల్)

పట్టభద్రుడు.. ఎవరో!

మొత్తం ఓట్లు - 3,14,984
పోలైన ఓట్లు - 2,18,902
టేబుళ్లు - 28 - రౌండ్లు 17

ఏలూరు సీఆర్‌ఆర్‌లో కౌంటింగ్ ఏర్పాట్లు

నేడే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్

- ఏలూరు సీఆర్‌ఆర్‌లో ఏర్పాట్లు
- 36 గంటల పాటు లెక్కింపు
- అధికారుల అంచనా
- నిరవధికంగా సాగేలా చర్యలు
- షిఫ్టుల వారీగా సిబ్బంది
- బరిలో 35 మంది అభ్యర్థులు
- ఫలితం తేల్చేది ప్రాధాన్యత ఓట్లే

(ఏలూరు/రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఏలూరు సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫలితం వెలువడే వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఓట్ల లెక్కింపు సిబ్బందిని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ జరుగుతున్న తీరును రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పర్యవేక్షిస్తారు.అభ్యర్థుల పక్షాన ఏజెంట్లు సైతం కౌంటింగ్‌కు హాజరవుతారు. ఈ ఓట్ల లెక్కింపు కాస్త సుదీర్ఘంగానే కొనసాగబోతోంది. లెక్కింపు ఒక కొలిక్కి వచ్చేసరికి 36 గంటలు లేదా ఆపైబడి సమయం పడుతుందని భావిస్తున్నారు.

నేడు ఓట్ల లెక్కింపు..

పట్టభద్రుల నియోజకవర్గ ఓట్లను సోమవారం లెక్కించనున్నారు.గత నెల 27న పోలింగ్ జరగ్గా 2 లక్షల 18 వేల 902 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా అధికార పక్షం భావిస్తోంది.పోలింగ్ సమయంలోనే నువ్వానేనా అనే ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో గత ఐదు రోజులుగా పోటీ చేసిన 35 మంది అభ్యర్థులతో పాటు, వారి అనుచరులు ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పట్టభద్రుల నియోజకవర్గంలో ప్రాధాన్యతా ఓటు ప్రకారం కొనసాగుతుంది.ఈ ప్రక్రియ అత్యంత సంక్లిష్టం కావడంతో కౌంటింగ్ సిబ్బందికి తగినంత శిక్షణ ఇచ్చారు. సోమవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉదయం 6.30 గంటల్లోపే నిర్దేశిత ప్రాంతాలకు చేరుకోవాల్సిందిగా సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది, టేబుల్స్ సూపర్‌వైజర్లు, రోల్ ఇన్‌చార్జులు, పర్యవేక్షణాధికారులు తమ పరిధిలో బాధ్యతలు నిర్వర్తించాల్సిందిగా ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు తెరిచే సమయంలో కట్టలు కట్టడం, ఆ తర్వాత లెక్కించే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ మేరకు జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి మార్గనిర్దేశం చేశారు.

లెక్కింపునకు 36 గంటలు

సాధారణ ఎన్నికల కంటే భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే దాదాపు 2 లక్షలకు పైగా బ్యాలెట్ పత్రాలను లెక్కించాల్సి ఉంది. అందుకే ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. తొలుత మొత్తం పోలైన ఓట్లలో చెల్లుబాటు కాని ఓట్లను గుర్తిస్తారు. ఇవి పోను, మిగిలిన ఓట్లను ప్రాధాన్యత క్రమంలో ఏ అభ్యర్థికి దక్కాయో వరుసగా లెక్కిస్తారు.ఈ ప్రక్రియ యావత్తు కొనసాగడానికి కాస్త సమయం పడుతుంది. ఓట్ల లెక్కింపు నిరవధికంగా కొనసాగడానికి వీలుగా లెక్కింపు సిబ్బంది,అధికారులను షిఫ్టుల వారీగా నియమించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పోలైన 2 లక్షల 18 వేల 902 ఓట్లను ఒక కొలిక్కి తేవాలంటే ఒక రోజంతా పడుతుందని భావిస్తున్నారు. ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు.. 17 రౌండ్లుగా ఉండేటట్టు నిర్దేశించారు. దీనికి అనుగుణంగా అన్నీ ఏర్పాట్లు చేశారు. ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీ చేసినందున ఆ మేరకు మరింత అప్రమత్తం అయ్యారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ముందుగా చెల్లని ఓట్లను తొలగించడం, మిగతా ఓట్లను కట్టలుగా కట్టి టేబుల్‌కు వెయ్యి చొప్పున మొత్తం 28 టేబుళ్లకు కలిపి 28 వేల వేల ఓట్లు లెక్కించడం ఆరంభిస్తారు. ఇలా 17 రౌండ్లు లెక్కింపు సాగుతుంది. రాత్రి పొద్దుపోయే సమయానికి ఈ ముందస్తు ప్రక్రియ ఒక్క కొలిక్కి రాగలదని,ఆ తర్వాతే అసలు సిసలైన ఓట్ల లెక్కింపు గాడినపడుతుందని అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆసాంతం పదేపదే సరి చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడున్న అధికారిక అంచనాల ప్రకారం లెక్కింపునకు 36 గంటలు దాటి సమయం పట్టే అవకాశం ఉంది.

నేటితో ఉత్కంఠకు తెర

రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ, మార్చి2(ఆంధ్రజ్యోతి) : మరికొన్ని గంటల్లో ఎమ్మెల్సీ ఉత్కంఠకు తెరపడనుంది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 35 మంది పోటీ పడగా గురువారం పోలింగ్ జరిగింది. ఈ మేరకు ఓట్లను సోమవారం ఏలూరులో లెక్కించనున్నారు. మొత్తం 3,14,984 ఓట్లు ఉండగా, 2,18,902 ఓట్లు పోలైన సంగతి తెలిసిందే. ఇది 69.50 శాతం.అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో మొత్తం 4669 ఓట్లు ఉండగా 3637 ఓట్లు పోలయ్యాయి. ఇది 77.9 శాతం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం 64,471 ఓట్లు ఉండగా 47,125 ఓట్లు పోలయ్యాయి.ఇది 73.09 శాతం. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 62,970 ఓట్లు ఉండగా 42,446 ఓట్లు పోలయ్యాయి. ఇది 67.41 శాతం. ఏలూరు జిల్లాలో 42,282 ఓట్లు ఉండగా 29,651 ఓట్లు పోలయ్యాయి. ఇది 70.13 శాతం. కాకినాడ జిల్లాలో మొత్తం 70,540 ఓట్లు ఉండగా, 47, 150 పోలయ్యాయి.ఇది 66.84 శాతం. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 70052 ఓట్లు ఉండగా, 48,893 ఓట్లు పోలయ్యాయి.ఇది 69.8 శాతం. ప్రధానంగా పోటీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం..పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవుల మధ్యన ఉన్నట్టు సమాచారం. పట్టభద్రులు ఎవరికి పట్టం కట్టారనేది మరి కొన్ని గంటల్లోనే తేలిపోనుంది.ఆరు జిల్లాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను ఏలూరులో భద్రపర్చారు.ఓటింగ్ సరళి ప్రకారం పరిశీలిస్తే.. ఫలితాలు రావడానికి 14 గంటలుగానీ,36 గంటల నుంచి 48 గంటలుగానీ సాగే అవకాశం ఉందంటున్నారు.



కాటన్ బ్యారేజీకి

మంచిరోజులు

117 గేట్ల మార్పునకు నిధులు

- ఫలించిన ఎదురుచూపులు
- బ్యారేజీ మరమ్మతులకు నిధులు
- రూ.150 కోట్ల ప్రతిపాదనలు
- రూ.146 కోట్లు మంజూరు
- నేడో రేపో టెండర్లు పిలుపు
- గత ప్రభుత్వంలో చిన్నచూపు
- ఐదేళ్లు కనీస మరమ్మతుల్లేవ్
- కూటమి రాకతో బ్యారేజీపై దృష్టి
- నిధుల విడుదలకు ప్రయత్నాలు
- డ్రిప్ పథకం కింద మంజూరు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి పూర్వవైభవం రానుంది.కూటమి ప్రభుత్వం చొరవ కారణంగా ఈ వారంలో డ్రిప్ పథకం కింద రూ.146 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ వేసవిలోనే టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టనున్నారు. దీంతో బ్యారేజీ మనుగడకు ముప్పు తప్పినట్టయింది. గత ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరైన నిర్వహణ లేక కాటన్ బ్యారేజీ మరమ్మతులకు గురైంది. ఈ మేరకు ఢిల్లీలోని సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యుసీ) 2022లో స్వయంగా పరిశీ లించి తక్షణం మరమ్మతులు చేయకపోతే సమస్య ఉత్పన్నమవుతుందని అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అయినా పట్టించుకోలేదు. గతేడాది జనవరి 11,12 తేదీల్లో ప్రపంచ బ్యాంక్ నిపుణుల బృందం బ్యారేజీని పరిశీలించి మొత్తం 117 గేట్లను మార్చి కొత్తవి అమర్చాలని సూచించింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కదలికలేదు. ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకూ 7 కిలోమీటర్ల పొడవున బ్యారేజీకి 175 ఫ్లడ్ గేట్లు, 22 స్లూయిజ్‌లు కలిసి మొత్తం 197 ఉన్నాయి. గత ప్రభుత్వం అసలు బ్యారేజి నిర్వహణ పట్టించుకోకపోవడంతో చాలా గేట్లు నిర్వహణ కష్టమవుతోంది.ఆపరేట్ చేసే సమయంలో అవి మొరాయిస్తున్న సంగతి కూడా తెలిసింది.

10.5 లక్షల ఎకరాల ఆయకట్టు

వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరంతా లక్షలాది టీఎంసీలు ధవళేశ్వరం కాటన్ బ్యారేజి గుండా దిగువకు వెళ్లాల్సిందే. ఎంత నీరు వచ్చినా 175 గేట్లు దాటి అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుండా సముద్రంలోకి పోతుంది. అంతే కాకుండా ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో తూర్పుగోదావరి, కాకినాడ,అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 10.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు బ్యారేజీ కారణంగానే నీరందుతుంది. 2 కోట్ల మంది ప్రజలకు మంచినీరు, పలు పరిశ్రమలకు నీరు లభిస్తోంది.బ్యారేజి ఏ మాత్రం దెబ్బతిన్నా ఏటిగట్టూ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.ఇంతటి ప్రాధాన్యత ఉన్న బ్యారేజీ కాపాడడానికి వైసీపీ ప్రభుత్వం కనీస ఆలోచన చేయలేదు.సీడబ్ల్యుసీ నిపుణులు 117 గేట్లు మొత్తం మార్చేయాలని చెప్పినా పట్టించు కోలేదు.ఇరిగేషన్ అధికారులు కొన్ని ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు.

నిధుల మంజూరు ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ బ్యారేజీని డ్యామ్ రిహేబిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రామం (డ్రిప్)లో పెట్టారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ నుంచి గత జూన్‌లో అప్పటి డీఈ రమేష్ ఢిల్లీ వెళ్లి రూ. 150కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చి వచ్చారు. ఇందులో గేట్లు రీప్లేస్‌మెంట్, మరమ్మతులకు రూ.110 కోట్లు అంచనా వేశారు. ఎలక్ట్రికల్ , కేబుల్, కంట్రోలు ప్యానల్‌కు సుమారు రూ. 9.5కోట్లు అంచనా వేశారు. రోడ్ల నిర్మాణానికి రరూ.4 కోట్లు,సివిల్ వర్కుకు రూ.18 కోట్లు, భవన నిర్మాణానికి రూ.3 కోట్లు అంచనా వేశా రు. రూ. 150 కోట్లు ప్రతిపాదించగా రోడ్ల నిర్మాణం పూర్తికావడంతో రూ.146 కోట్లకు అనుమతిచ్చి శాంక్షన్ చేశారు.దీంతో బ్యారేజీకి మంచిరోజులొచ్చినట్టు అయింది.

9 నుంచి కోరుకొండ నరసన్న కల్యాణోత్సవాలు

- ఐదు రోజుల పాటు ఉత్సవాలు
- ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- 10న రథోత్సవం..కల్యాణం
- ఉత్సవాల్లో ఉచిత అన్నదానం
- ముస్తాబు చేస్తున్న నిర్వాహకులు

కోరుకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 9న అంకురార్పణతో ప్రారంభమై 15వ తేదీ చక్రతీర్థంతో ఉత్సవాలు ముగియనున్నాయి. అన్నవరం దత్తత దేవాలయంగా ఉండడంతో ఆ దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.సుబ్బారావు పర్యవేక్షణలో అనువంశక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్‌ల పర్యవేక్షణలో కల్యాణోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి.స్వామి వారి దిగువ ఆల యం, కొండపైన ఆలయాలకు, ఉప ఆలయాలకు,ముఖ ద్వారాలకు మెట్ల మార్గానికి, ఆలయ శిఖరాలకు రంగులు వేస్తున్నారు. అర్చకస్వాములు ఉత్సవ మూర్తులను సిద్ధం చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, టెంట్లు వేస్తున్నారు. ఉత్సవాలకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు.అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. పాల్గుణ శుద్ధ ఏకాదశి రోజు ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజున పెద్ద ఎత్తున భక్తులు దేవుడి కోనేరులో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకోవడం ఇక్కడ సాంప్రదాయం.ఈ మేరకు కోనేరు వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు, బట్టలు మార్చుకునే షెడ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానం సిబ్బంది భక్తులకు స్వామి ప్రసాదంగా లడ్లు తయారుచేస్తున్నారు.ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి.సుమారు 16 వరకు హుండీలు ఏర్పాటు చేస్తున్నారు. అంతే కాకుండా మిరియాల వెంట రెడ్డి పంతులు ధర్మసత్రంలో ఐదు రోజుల పాటు ఉదయం, సాయంత్రం భక్తులకు ఉచిత అన్నప్రసాదం అందించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో ఐదు రోజులు పాటు పండితసభలు ఏర్పాటు చేయ నున్నారు.





9న ఉత్సవాలకు అంకురార్పణ

9వ తేదీన ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 10వ తేదీన మొదటి రోజు రథంపై స్వామి గ్రామోత్సవం చేస్తారు.అనంతరం నాలుగు రోజులు ఆంజనేయ,గరుడ, చిన్నశేషవాహనం, పెద్ద శేషవాహనం,గజవాహనాలపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆయా వాహనాలు సిద్ధం చేస్తున్నారు.ప్రతిరోజు రాత్రి జరిగే గ్రామోత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కల్యాణవేదికపై మొదటి రోజు స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి రోజు రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. హరికథలు, బుర్రకథలు, కోలాటం, భరతనాట్యం వంటివి నిర్వహించనున్నారు.

పల్లెకు.. పండగేది!



అసంపూర్తిగా గోకులం షెడ్

బిల్లులు రాక.. నిలిచిన పనులు

- ఇప్పటికే నీరసించిన పనులు
- ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి
- రూ.147 కోట్లు పెండింగ్
- కాంట్రాక్టర్ల లబోదిబో
- సీసీ రోడ్లవే రూ.110 కోట్లు
- అసంపూర్తిగా గోకులాలు
- పూర్తికాని డ్రెయినేజీల నిర్మాణం
- ఎక్కడి పనులు అక్కడే

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

పల్లె పండగ పేరుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అనేక పనులు అప్పుడే నీరసించాయి. బిల్లులు రాకపోవడంతో రెండు నెలలుగా ఎక్కడివి అక్కడే అన్నట్టు ఈసురోమంటున్నాయి. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి సంబంధించి బిల్లులు ఆలస్యం అవడంతో పలు చోట్ల వీటిని కాంట్రాక్టర్లు నిలిపివేశారు. బిల్లులు వచ్చాక తిరిగి చేద్దామనే ధోరణితో మధ్యలోనే వదిలేశారు. అటు గోకులాల షెడ్లను తొలుత సొంత నిధులతో ప్రారంభించిన రైతులు సైతం బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.4 కోట్ల వరకూ బిల్లులు విడుదల కావాల్సి ఉంది. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లా వ్యాప్తంగా రూ.147 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రూ.110 కోట్లకుపైగా బకాయిలు సీసీ రోడ్లవే కాగా మిగిలినవి గోకులాల షెడ్ల బాకీలున్నాయి. అయితే బకాయిల్లో కేంద్రం నుంచి సగానికిపైగా, మిగిలినవి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ నుంచి విడుదల కావాల్సి ఉన్నాయి. మరో పక్క రైతులు ముందుకురాని చోట్ల కాంట్రాక్టర్లు నిర్మించిన గోకులాల షెడ్లలో అప్పుడే నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి.



అసంపూర్తిగా ఉన్న సీసీ రహదారి

వచ్చాక చూద్దాం..

వాస్తవానికి రెండునెలలుగా అధికారులు అదిగోఇదిగో అంటున్నా బిల్లులు రాకపోవడంతో అటు కాంట్రాక్టర్లు, ఇటు రైతులు పనులను మధ్యలో ఆపేశారు. సీసీ రహదారులకు సంబంధించి ఒక్కో పనిని రూ.3 లక్షల వరకు విభజించి నామినేషన్ ప్రాతిపదికపై కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీరంతా చిన్నాచితకా కాంట్రాక్టర్లు కావడంతో బిల్లులు రాక పనులు చేయలేమని తెగేసి చెప్పేస్తున్నారు. కొందరైతే ప్రారంభించినవి మధ్యలో ఆపేయగా, మరికొందరు బిల్లులు వస్తేనే పని మొదలుపెడతామని తెగేసి చెబుతున్నారు. వాస్తవానికి పల్లె పండగకు పనులకు సంబంధించి ఉపాధి హామీ పనుల ద్వారా సమకూరే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వెచ్చిస్తున్నారు. ఈ నిధులు 75 శాతం కేంద్రం, మిగిలిన 25 శాతం రాష్ట్రప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆర్థికంగా అనేక ఇబ్బందులున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి కొంత జాప్యమవుతోంది. కాగా ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల గోకులాల షెడ్లను ముందుగా తమ సొంత నిధులతో నిర్మించుకోలేని రైతుల కోసం అధికారులే కొందరు కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పనులు చేయి ంచారు. వీటిలో చాలా వరకు నాణ్యతా లోపాలు బయటపడుతుండడం విశేషం.

రూ.147 కోట్ల బకాయి

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల పరిధిలో కొత్తగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం గతేడాది అక్టోబరు 14 నుంచి పల్లె పండగ పేరుతో అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఉపాధి హామీ పథకానికి సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్, ఆర్థిక సంఘం నిధుల ద్వారా బిల్లులు చెల్లించే విధంగా పనులకు జిల్లాల వారీగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామాల్లో ఎక్క డెక్కడ సీసీ రోడ్లు, డ్రెయినేజీలు అవసరమో గుర్తించి వాటిని నిర్మించడానికి వీలుగా అంచ నాలు సిద్ధం చేశారు. రైతుల కోసం గోకులాల షెడ్లను ఈ పథకంలో చేర్చారు. సీసీ రహదారులు, డ్రెయిన్లు, గోకులాల షెడ్లకు సంబంధించి కాకినాడ జిల్లాలో మొత్తం రూ.180 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. ఇందులో ఇప్పటి వరకు రూ.38 కోట్ల బిల్లులు చెల్లించారు. కానీ పూర్తయిన, మధ్యలో కొనసాగుతున్న పనులకు సంబంధించి ఇంకా రూ.42 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. డిసెంబరు నెలాఖరు వరకు ఠంచనుగా వచ్చిన బిల్లులు ఆ తర్వాత నుంచీ పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా అనేక పనులను అటు కాంట్రాక్టర్లు, ఇటు రైతులు నిలిపివేశారు. బిల్లులు వస్తేనే తిరిగి చేయగలమంటూ అధికా రులకు తెగేసి చెప్పేశారు. మరో పక్క బిల్లులు రాకపోవడంతో రూ.102 కోట్లకు సంబంధించి వివిధ దశల్లో ఉన్న పలు పనులపైనా ప్రభావం పడింది. అనేక చోట్ల కాంట్రాక్టర్లు వీటిని మధ్యలో నిలిపివేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 650 సీసీ రహ దారులు, 675 గోకులాల షెడ్లను ఈ పథకం కింద ప్రారంభించారు.ఇప్పటి వరకు కొన్ని బిల్లులు చెల్లింపులు జరగ్గా, ఇంకా రూ.65 కోట్ల వరకు బాకీలు పేరుకుపోయాయి.ఇందులో రూ.4 కోట్ల వరకు గోకులాల షెడ్లకు సంబం ధించిన బిల్లులుండగా,మిగిలిన రూ.61 కోట్లు సీసీ రహదారులవే ఉన్నాయి.అటు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోను రూ.40 కోట్ల వరకు బిల్లులు పేరుకుపోయాయి. సింహభాగం సీసీ రహదారులవే. మొత్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.147 కోట్లు బకాయిలుగా తేలాయి.ఇవి రాక అనేక పనులపై ప్రభావం పడింది.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముప్పిడి





పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

నిడదవోలు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తె మ్మకి దేవస్థానంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు గావించారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహానివేదన చేశారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 29,989, అన్నదాన విరాళాల ద్వారా రూ. 1238, ప్రసాద విక్రయాల ద్వారా రూ.20,700, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా రూ. 52,170, మొత్తం రూ.1,04,088 ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వీ.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు జవహర్ పరామర్శ



పరామర్శిస్తున్న టీడీపీ నేత, మాజీమంత్రి జవహర్

తాళ్లపూడి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం రోజున గోదావరి స్నానాలకు వెళ్లి దురదృష్టవశాత్తు మృతిచెందిన తాడిపూడి గ్రామానికి చెందిన తిరుమలశెట్టి పవన్, పడాల దుర్గాప్రసాద్, అవిశెట్టి పవన్, గర్రె ఆకాష్, పడాల సాయిల కుటుంబాలను మాజీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. దీనిపై సీఎం చంద్రబాబు నాయుడు, సంబంధిత అధికారులతో మాట్లాడానని చెప్పారు. అలాగే పార్టీ ఎప్పుడూ వారి కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. త్వరలో ఎక్స్‌గ్రేషియా అందించడానికి కృషి చేస్తామన్నారు. టీడీపీ నేతలు వేగి చిన్న, బీవీరాఘవులు, కే.ప్రసాద్, ఆత్కూరి రాంబాబు, చవ్వాకుల సత్యనారాయణ, సిద్దన రామకృష్ణ, నామా సురేంద్ర, జనసేన నాయకులు లింగంపల్లి సుధీర్, టీ. సత్యనారాయణ, ఎ. కరుణాకర్, ఎం.యోహాన్ పాల్గొన్నారు.

ధనలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వేలివెన్ను, కాల్ధరి పొలాల్లో వెలసిన ధనలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో వేలివెన్ను, కాల్ధరి, శెట్టిపేట రైతులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత మెగా చికెన్ మేళాకు విశేష స్పందన



జాంపేటలో నిర్వహించిన చికెన్ మేళా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆజాద్ చౌక్‌లో ఆదివారం సాయంత్రం రాజమండ్రి సిటీ చికెన్ హోల్‌సేల్ అండ్ రిటైల్ వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా చికెన్ మేళాకు విశేష స్పందన లభించింది. చికెన్ తినండి, ఆరోగ్యంగా ఉండండి అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రమాదం కాదా.. ఈ ప్రయాణం ?

- ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్న వైనం
- తరచూ రోడ్డు ప్రమాదాలు...
- పట్టించుకోని అధికారులు



ఆటోలో పరిమితికి మించి ఉన్న ప్రయాణికులు

కొవ్వూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఎన్ని చట్టాలు రూపొందించినా... వాహన చోదకులు, జనాల్లో మాత్రం మార్పు కానరావడం లేదు. తరచూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. దీన్ని పర్యవేక్షించాల్సిన పోలీసు, రవాణా, ట్రాన్స్‌పోర్టు అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. డ్రైవర్ సీటుకు ఇరుపక్కలా, వెనుకవైపు కూర్చోబెడుతున్నారు. అలాగే సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహన చోదకులు రోడ్డు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుండగా, ఎక్కువమంది గాయాలపాలై మృత్యువాత పడుతున్నారు. స్కూల్ పిల్లలను తరలించే ఆటోల్లో అయితే దాదాపు 12 నుంచి 20 మంది వరకు, 40 మంది సామర్థ్యం కలిగిన స్కూల్ బస్సులలో 60 మందికి పైగా విద్యార్థులను ఎక్కిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సి ఆర్టీఐ అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. ఇకనైనా అధికారులు పట్టణంలో నిత్యవసరాలకు వస్తున్న ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ హైవే, ప్రధాన రహదారుల్లో మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న వాహనాలను తనిఖీ చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గత నెల 26వ తేదీన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి నుంచి ఆటోలో తొమ్మిది మంది పట్టిసీమకు బయలుదేరారు. ఈ క్రమంలో కొవ్వూరు మం డలం చిడిపి గోదావరి ఏటిగట్టు రోడ్డులో ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తూము రమణ (40) గొంతులో ఇనుప ఊచ దిగిపోవడంతో తీవ్ర రక్తస్రావమై మృతిచెందాడు. మరో ఐదుగురు గాయాలపాలైన సంఘటన ఉదాహరణగా నిలుస్తుంది.



స్కూల్ ఆటో ఇలా..

కేసులు నమోదు చేస్తున్నాం

• శివప్రసాద్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, కొవ్వూరు

నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. వారి అవసరాల దృష్ట్యా రిపీటెడ్‌గా అవే తప్పులు చేస్తున్నారు. అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రమాదాల నివారణకు కొవ్వూరు ఎంవీఐ కార్యాలయ పరిధిలో రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించి డ్రైవర్లను ఎడ్యుకేట్ చేస్తున్నాం. ప్రజలు కూడా కొంత వరకు సహకరించాలి. అప్పుడే ప్రమాదాలు నివారించొచ్చు.

మంత్రి అడిషనల్ పీఎస్‌గా శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అడిషనల్ పీఎస్‌గా శ్రీనివాసరావు నియామకం కానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో కూడా విడుదల చేసినట్టు తెలిసింది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఈయన విధుల్లో చేరుతారు. ప్రస్తుతం శ్రీనివాసరావు రాజమహేంద్రవరం రూరల్ మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు మిరాకిల్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్ ప్రదానం



సర్టిఫికెట్ అందుకున్న నృత్య కళాకారిణుల బృందం

నిడదవోలు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని భ్రామరి కూచిపూడి నాట్య నిలయం విద్యార్థినులు హైద్రాబాద్‌లో జరిగిన మహాశివరాత్రి మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాజరాజేశ్వరి భరత కళా సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో తమ బృందానికి మిరాకిల్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ సర్టిఫికెట్ ఇచ్చి గుర్తించిదని నాట్య నిలయం వ్యవస్థాపకురాలు పి.పావని తెలిపారు.

అందించిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి

• ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



తహశీల్దార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జేసీ చినరాముడు

దేవరపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని, అందించిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాలులో ఆదివారం తహశీల్దార్ కే.రాజ్యలక్ష్మి పదవీ విరమణ సత్కారసభ జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ చినరాముడు హాజరై తహశీల్దార్ దంపతులను సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యలక్ష్మి రెవెన్యూ శాఖలో అంచెలంచెలుగా ఎదుగుతూ అందరి మన్ననలు పొందారని కొనియాడారు. 40 సంవత్సరాల సర్వీసులో మంచి అధికారిగా పేరు తెచ్చుకోవడం గొప్ప విషయమన్నారు. సన్మాన గ్రహీత తహశీల్దార్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి తహశీల్దార్ వరకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించానన్నారు. అనంతరం తహశీల్దార్ కే.రాజ్యలక్ష్మి, వెంకట్రెడ్డి దంపతులను రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనీల్, టీడీపీ నాయకులు చినబాబు, గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, పెనుమత్స సుబ్బరాజు, ఉప్పులూరి రాంబాబు, గద్దే సుబ్రహ్మణ్యం, రెవిన్యూ అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రక్కిలంకలో ముగిసిన సౌరయాగం



విశ్వేశ్వరస్వామి ఆలయంలో సౌరయాగం నిర్వహిస్తున్న పండితులు

తాళ్లపూడి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంకలో వేంచేసియున్న అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సౌరయాగం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పాల్గొని ఉషా చాయాపద్మినీ సమేత సూర్యనారాయణ స్వామి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం సుమారు 3000 మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అర్చకులు కౌతవరపు విశ్వనాథశర్మ బృంద సభ్యులు పూజలు చేశారు.

కలుపుమందు తాగి... చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కలుపుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలివి... పెరవలి మండలం ఖండవల్లికి చెందిన డోనెల అంజనేయులు కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తుండేవాడు. గత ఐదుసంవత్సరాలుగా ఫైనాన్స్‌లో వ్యాన్‌లు కొనుగోలు చేసి అద్దెకు తిప్పేవాడు. అయితే వ్యాపారంలో ఇటీవల నష్టాలు రావడంతో ఫిబ్రవరి 14న తణుకు వెళ్లిగడ్డి కలుపు మందును కొనుగోలు చేశాడు. దాన్ని తీసుకొని వెళ్లి మద్దూరులంక శివారురులోని పొలాల్లో తాగేశాడు. 18వ తేదీన నొప్పితో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు తణుకులోని అమృత ఆసుపత్రిలో చేర్చారు. తర్వాత గుంటూరులోని మంగళగిరి ఎయిమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుని భార్య గంగరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు రమణమ్మ జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో రాజమహేంద్రవరం నుంచి కీలకపాత్ర వహించిన మద్దూరు వెంకట రమణమ్మ, అన్నపూర్ణయ్య మహనీయ దంపతులు అని చాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా డైరెక్టర్ కొయ్యను కుమారి కొనియాడారు. రమణమ్మ 119వ జయంతి సందర్భంగా కోటిపల్లి బస్టాండ్ వద్ద గల ఆమె విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దీనిలో భాగంగా పలువురు వక్తలు ఆమె సేవలు గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక పరురాలు మంచిరాజు హేమలత, ఫ్రీడం పార్కు కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బలరామ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట : ఎమ్మెల్యే



దేవరపల్లి పీహెచ్‌సీ వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

దేవరపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, పేషేంట్లు, ప్రజాప్రతినిధులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. దీంతో సరైన వైద్యసదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడేవారన్నారు. దేవరపల్లి పీహెచ్‌సీలో 25 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం అక్కడక్కడ పెచ్చులూడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, పాతభవనాల మరమ్మతులతో పాటు కొత్త భవనాల నిర్మాణానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాంబశివరావు, టీడీపీ నాయకులు ఆండ్రూ అనీల్, గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, కొయ్యలమూడి చినబాబు, గద్దే సుబ్రహ్మణ్యం, ఉప్పులూరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

'అందరికీ కార్పొరేట్ వైద్యం అందిస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సీఈవో విజయరాజు

తాళ్లపూడి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సైతం కార్పొరేట్ వైద్యం అందించాలన్న ధ్యేయంతో ఉచిత మెగా క్యాంపులు నిర్వహిస్తున్నట్టు సాయి స్ఫూర్తి మల్టీ ఆసుపత్రి సీఈవో గూడ విజయరాజు అన్నారు. ఆదివారం బిగ్ టీవీ చానెల్ సహకారంతో గజ్జరంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం, గోపాలపురం, దేవరపల్లి, కొవ్వూరు మండలాలకు అందుబాటులో ఆరోగ్యశ్రీ సేవలు అందించే ఏకైక ఆసుపత్రి తమదేనన్నారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గండి రాంబాబు ప్రారంభించారు. బిగ్ టీవీ ప్రతినిధి సున్నం శ్రీహరిబాబు, ఆసుపత్రి సిబ్బంది పాటోలు సీత భారతి, డా. ఏ. డేవిడ్‌రాజు, వీటీజీ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుబ్బల మంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



గుడ్డిగూడెంలో నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహం, పూజకు హాజరైన భక్తులు

గోపాలపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుడ్డిగూడెం గ్రామ శివారులో గుబ్బల మంగమ్మ వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి శాస్త్రోక్తంగా పండితుల వేదమంత్రాల నడుమ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ముందుగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, పంచగవ్య ప్రార్థన, దీక్షాధారణ, జలాదివాసము, క్షీరాది వాసము, ధాన్యాదివాసము వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం గజపతిపూజ, పుణ్యాహవచనంతో పూజ ప్రారంభమైంది. అనంతరం 11.20 నిమిషాలకు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవరపల్లి సీఐ నాగేశ్వరరావు నాయక్, గోపాలపురం, దేవరపల్లి ఎస్ఐలు సతీష్‌కుమార్, సుబ్రహ్మణ్యం తమ సిబ్బందితో భద్రత చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

వెంకన్న ఆలయంలో ఎస్పీ దంపతుల పూజలు



ఎస్పీ నరసింహకిషోర్ దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆలయ అర్చకులు

దేవరపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ దంపతులు దర్శించుకున్నారు.దీనిలో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ ఆచార్యులు ఆశీర్వచనాలు అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆదిశంకరాచార్య ధ్యానమందిరాన్ని పరిశీలించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి తోట సత్యనారాయణ స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తీగల బలరామయ్య, గుడ్ల వెంకటేశ్వరరావు, ఎస్ఐ వీ.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన, ప్రత్యేక పూజలు



పల్లంట్ల శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

దేవరపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పల్లంట్లలో రాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం అన్నసమారాధన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శివాలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సృజనా శర్మ, ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఆశీర్వచనాలు అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని రైతు దుర్మరణం

రాజానగరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరు సమీపంలో ఆదివారం లారీ ఢీకొని ఓ రైతు అక్కడికక్కడే మృతిచెందాడు. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన గారపాటి నరేంద్ర(45)కు కొంతమూరులో కొంత భూమి ఉంది. ఆ పొలంలోని వరి పండించి మాసూలు చేశాడు. ఆదివారం ధాన్యం తూకం వేయించి మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా కొంతమూరు సమీపంలోని నయారా పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న లారీని, అధిగమించబోతున్న మరో లారీ మోటార్ సైకిల్‌పై వెళ్తున్న నరేంద్రను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం ధాటికి శరీరం నుజ్జునుజ్జుగా మారింది. కాగా నరేంద్రకు ఇద్దరి కుమారులు ఉన్నారు. పంచానామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్ర వరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాజానగరం ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేశారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే వాసు ఆర్థిక సాయం



విద్యార్థి తల్లికి సాయాన్ని అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన వి.లక్ష్మీగాయిత్రి పేద విద్యార్థి. నీట్ పరీక్షకు సిద్ధమౌతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.50 వేలు టీడీపీ నాయకులతో కలిసి సమకూర్చారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు చేతుల మీదుగా విద్యార్థిని తల్లికి నగదును అందించారు. చదువుకు పేదరికం అడ్డం కాకుడదనే భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక మంది విద్యార్థులకు సహకారం అందిస్తున్నామని ఆదిరెడ్డి వాసు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, చాపల చిన్నరాజు, బంగారు నాగేశ్వరరావు, బత్తుల కిరణ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.